

RNI NO:TELTEL/ 2023/89546

సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 125 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 1 జనవరి 2025 | వెల : 4/-

# జనవరి 4న మంత్రివర్గ సమావేశం

- కొత్త రేషన్ కార్డులు, రైతుభరోసాలపై చర్చ
- జనవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశం
- కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి రూ. 12000 ఆర్థిక సహాయం
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డుపైన చర్చించే అవకాశం



హైదరాబాద్

జనవరి 4వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు హాజరు కానున్నారు. తెలంగాణ సచివాలయంలో జనవరి 4న సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. రైతు భరోసా, భూమి లేని పేదలకు నగదు బదిలీపై చర్చించనున్నట్లు సమాచారం. రైతు భరోసాకు అర్హతలు, కొత్త విధివిధానాలతో పాటు భూమి లేని పేదలను గుర్తించడం తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల (డిసెంబరు) 30నే మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి కారణంగా కేబినెట్? భేటీ వాయిదా పడింది. తెలంగాణ శాసనసభ ఆయన మృతి పట్ల వారి కుటుంబానికి సంతాపం తెలిపిన విషయం తెలిసిందే. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ ధరలతో ఇసుక, సిమెంట్, స్టీలు తదితర ముడి సరుకులు సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై - మిగతా3లో



## కొత్త సంవత్సరం రోజున కేటీఆర్‌ను బాధ పెట్టవద్దు

- రెండు రోజులు ఎంజాయ్ చేయనివ్వండి
- కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి షాకింగ్ కామెంట్స్
- కేటీఆర్ క్వాష్ పిటిషన్ పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు
- తీర్పు ఇచ్చేంత వరకు అరెస్ట్ చేయవద్దని ఆదేశం
- 3, 4 తేదీల్లో కేటీఆర్ గురించి చూద్దామని వ్యాఖ్య

హైదరాబాద్

ఫార్ములా ఈ-కార్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెట్టుకున్న క్వాష్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారించింది. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తీర్పు ఇచ్చేంత వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ రెండు రోజులు ఎంజాయ్ చేయనివ్వండి అని అన్నారు. కొత్త సంవత్సరం రోజు కేటీఆర్‌ను బాధ పెట్టకండి అని చెప్పారు. న్యూ ఇయర్ రోజు ఎంజాయ్ చేయనీయాలని అన్నారు. కేటీఆర్ గురించి 3, 4 వ తేదీల్లో చూద్దామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి - మిగతా3లో




## సమష్టి విజయాల వత్సరం..



- 2025లోనూ వికసిత్ భారత్ దిశగా అడుగులు
- ప్రగతి, ఐక్యత, వికసిత్ భారత్ దిశగా వేసిన అడుగులను ఈ ఏడాది గుర్తుచేస్తుంది
- భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిన సంవత్సరం 2024
- భారతదేశ విధానాలు, కార్యక్రమాలతో దేశంలో నిలకడైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా గ్రామీణ-పట్టణ అసమతౌల్యత తొలగింది

## వెల్‌కమ్ 2025

కళ్లు మిరుమిట్లు గొలిపేలా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన ఆస్ట్రేలియా పాతకు వీడ్కోలు పలుకుతూ, కొత్తకు స్వాగతం చెబుతూ...



## రైతు భరోసా మీద ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. 21 వేల కోట్ల రుణమాఫీ, రూ.7,625 వేల కోట్ల రైతు బంధు, రూ. 3 వేల కోట్ల రైతు భీమా ఇచ్చింది
- కేబినెట్ సబ్ కమిటీ కేవలం విధి విధానాల మీద చర్చించడం మాత్రమే చేశాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




## అప్పటి వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దు

ఫార్ములా ఈ-రేస్ కేసులో క్వాష్ పిటిషన్ వేసిన కేటీఆర్
నేడు సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు
కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దంటూ ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు



హైదరాబాద్

ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో స్వల్ప ఊరట దక్కింది. ఈ కేసులో తీర్పు వెల్లడించే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. ఫార్ములా రేసు కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు సుదీర్ఘ విచారణ జరిగింది. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. - మిగతా3లో



## అంతరిక్షంలో వ్యోమగాములకు 16 సార్లు న్యూఇయర్

- వాళ్లు మాత్రమే 2025కి 16 సార్లు స్వాగతం పలుకుతారని తెలుసా!?
- గంటకు 28 వేల కిలోమీటర్లు తిరుగుతున్న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్
- 90 నిమిషాల్లో భూమి చుట్టివేత
- 24 గంటల్లో 16 సార్లు తిరుగుతున్న ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్
- వ్యోమగాములకు కొత్త ఏడాదికి 16 సార్లు స్వాగతంపలికే అవకాశం

# కేసీఆర్ ఇక దూరమేనా?

- రాజకీయంగా కేసీఆర్ దూరంగా అయినట్లేనా!
- కేసీఆర్ గైర్హాజరు కావడం రాజకీయ చర్చకు దారి తీసింది
- విమర్శలు, ప్రతివిమర్శలకు తావు లేని తీరులో జరిగిన ఈ సమావేశాలకు ఆయన డుమ్మా కొట్టడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలోనే హాట్ టాపిక్
- సభకు హాజరై ఉండి ఉంటే బాగుండేదని, అలా హాజరు కాకపోవడం ద్వారా విమర్శలకు తావు ఇచ్చినట్లయింది



హైదరాబాద్

దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలియజేసే అంశానికి పరిమితమై ఒక రోజు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించినా కేసీఆర్ గైర్హాజరు కావడం రాజకీయ చర్చకు దారి తీసింది. విమర్శలు, ప్రతివిమర్శలకు తావు లేని తీరులో జరిగిన ఈ సమావేశాలకు ఆయన డుమ్మా కొట్టడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలోనే హాట్ టాపిక్ అయింది. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా పనిచేయడంతో పాటు ఆయన హయాంలోనే తెలంగాణ ఏర్పడినా ఇప్పుడు సంతాప తీర్మానంపై జరిగే చర్చలో ఆయన పాలుపంచుకోకపోవడంతో కేసీఆర్ చిత్తశుద్ధి ఇదేనా అనే ప్రశ్నలూ ఉత్పన్నమయ్యాయి. అయితే, కేసీఆర్‌కు ఈ సభ ఏం గౌరవం ఇచ్చిందా అంటూ - మిగతా3లో

# సమష్టి విజయాల వత్సరం..



**న్యూఢిల్లీ:** నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ తరుణంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను ప్రజలతో పంచుకున్నారు. సమష్టిగా కృషిచేసి 2024లో అనేక విజయాలు అందుకున్నామని, 2025లో మరింత కష్టపడి 'వికసిత్ భారత్' కలలను సాకారం చేసుకుందామని పేర్కొన్నారు. ప్రగతి, ఐక్యత, వికసిత్ భారత్ దిశగా వేసిన అడుగులను ఈ ఏడాది గుర్తుచేస్తుందన్నారు. దేశం ఈ ఏడాది కాలంలో సాధించిన విజయాలను వివరిస్తూ ఒక వీడియోను షేర్ చేశారు.

**పురోగతి, ఐక్యతా సంవత్సరం**

భారతదేశం అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిన సంవత్సరం 2024 అని ప్రధాని తెలిపారు. గ్రామీణ విద్యుద్దీకరణ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, డిజిటల్ కనెక్టివిటీ, లింగ సమానత్వం వంటి అంశాల్లో ఈ ఏడాది అసాధారణ ప్రగతిని సాధించామని అన్నారు. భారతదేశ విధానాలు, కార్యక్రమాలతో దేశంలో నిలకడైన మార్పులు వచ్చాయని, ముఖ్యంగా గ్రామీణ-పట్టణ అసమతౌల్యత తొలగిందని అన్నారు. గ్రామీణ భారతంలోని ప్రజల స్థితిగతులను మెరుగుపరచడంపై ఈ ఏడాది ప్రధానంగా దృష్టిసారించామని అన్నారు. పీఎం జన్‌ధన్ యోజనతో సహా అనేక పథకాలు సానుకూల ఫలితాలనిచ్చాయని, 54 కోట్ల ఫస్ట్ టైమ్ బ్యాంక్ హోల్డర్లు ఫార్మల్ బ్యాంకింగ్ సిస్టంలోకి వచ్చారని చెప్పారు. పీఎం ఆవాస్ యోజనతో గ్రామీణ హౌసింగ్ ముఖచిత్రమే మారిపోయిందని, 3.2 కోట్లకుపైగా గృహాలు మంజూరుచేయగా, 2.7 కోట్ల గృహాలు పూర్తయ్యాయని వివరించారు. లబ్ధిదారులలో 74 శాతం మహిళలే ఉన్నారని చెప్పారు. గ్రామీణ విద్యుద్దీకరణతో గ్రామాల్లో పదేపదే పవర్ కట్స్‌కు తెరపడిందన్నారు.

దేశంలోని ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసిందని మోదీ అన్నారు. 6 లక్షల గ్రామాలకు 4జి కనెక్టివిటీ వచ్చిందన్నారు. 'ఇండియా గ్రోత్ స్టోరీ'లో గ్రామీణ భారతం ఇప్పుడు చురుకైన భాగస్వామ్యం కలిగి ఉందని చెప్పారు. విధాన నిర్ణయాలు, పాలనలో మహిళల పార్టిషిపేషన్ కూడా పెరిగిందని, శాసనసభలు, పంచాయతీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని, ఓటింగ్‌లో పాల్గొంటున్న మహిళల శాతం కూడా పెరిగిందన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్టు చెప్పారు. 2017లో 400 మిలియన్ లావాదేవీలు జరగ్గా, 2024లో 170 బిలియన్ ట్రాన్సాక్షన్లు జరిగాయన్నారు. ఈ ఏడాది ఒక్క అక్టోబర్ మాసంలోనే రికార్డు స్థాయిలో 500 మిలియన్ ట్రాన్సాక్షన్లు జరిగినట్టు తెలిపారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం విషయంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రగతి సాధించామని, 2021లో ఒకే రోజు 25 మిలియన్ కోవిడ్-19 వ్యాక్సిన్లు వేశామని చెప్పారు. వ్యాక్సిన్ డిస్ట్రిబ్యూషన్‌లో కూడా గ్లోబల్ లీడర్‌గా భారత్ నిలిచిందని చెప్పారు. ఆపన్న దేశాలకు 300 మిలియన్ వాక్సిన్లు ఎగుమతి చేశామని తెలిపారు. మౌలిక వసతులకల్పన ఊపందుకుందని, 66 ఏళ్లలో 91,000 కిలోమీటర్ల మేర హైవేలు నిర్మిస్తే, తమ ప్రభుత్వం గత పదేళ్లలో మరో 54,000 కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను విస్తరించిందని మోదీ తెలిపారు. ఆర్థిక వృద్ధి, కనెక్టివిటీ, వాణిజ్యం, ఉద్యోగ అవకాశాలు దేశవ్యాప్తంగా పెరగడానికి ఈ చర్యలు దోహదపడ్డాయని చెప్పారు. గత దశాబ్ద కాలంలో 1.5 లక్షలకు పైగా స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలతో మార్కెట్ నుంచి సానుకూల స్పందన రావడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల బేస్ పెరిగిదంన్నారు. మ్యూచ్యువల్ ఫండ్స్ ద్వారా ఫైనాన్షియల్ మార్కెట్‌లో ప్రజల పార్టిసిపేషన్ పెరగడం కూడా ఇండియాస్ గ్రోత్ స్టోరీని, దీర్ఘ కాలిక అవకాశాలను ప్రతిబింబిస్తోందని అన్నారు. 'వికసిత్ భారత్' దిశగా 2025లోనూ మరింత ముందుకు అడుగులు వేయడం ద్వారా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం కలను సాకారం చేద్దామని ప్రధాని అభిలషించారు.

# వెల్కమ్ 2025..

పాతకు వీడ్కోలు పలుకుతూ, కొత్తకు స్వాగతం చెబుతూ... ప్రపంచవ్యాప్తంగా 2025 సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్నారు. మొదటగా పసిఫిక్ ద్వీపదేశాలు నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాయి. తాజాగా, ఆస్ట్రేలియా తూర్పు తీరంలోని సిడ్నీ నగరం కూడా 2025 సంవత్సరానికి వెల్కమ్ చెప్పింది.

కళ్లు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా విన్యాసాలు, ఆకట్టుకునే లేజర్ లైటింగ్ తో ప్రఖ్యాత సిడ్నీ హార్బర్, ఓపెరా హౌస్ జిగేల్మన్నాయి. వేలాది మంది ప్రజలు సిడ్నీ హార్బర్ వద్దకు చేరుకుని నూతన సంవత్సర ఘడియలను ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. తోటివారికి హ్యాపీ న్యూయర్ చెబుతూ 2025లోకి ప్రవేశించారు.

సిడ్నీ హార్బర్ వద్ద న్యూ ఇయర్ సంబరాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.

కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. మరికొద్ది గంటల్లో న్యూఇయర్ వస్తుండటంతో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు రకరకాల ప్లాన్స్ చేసుకుంటున్నారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి ఎప్పుడు అవుతుందా? హ్యాపీ న్యూఇయర్ అని ఎప్పుడెప్పుడు చెప్పుకుంటామా? అని ఎదురుచూస్తున్నారు. అయితే అన్ని దేశాల్లో కొత్త ఏడాది ఒకేసారి రాదు. ఒక్కో దేశం ఒక్కో సమయంలో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతుంది. ఇక భారత్‌లో డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 దాటగానే కొత్త ఏడాది ప్రారంభం అవుతుంది. అయితే, కొన్ని దేశాల్లో ఇప్పటికే కొత్త సంవత్సరం మొదలైపోయింది.

పసిఫిక్ సముద్రంలోని కిరిబాటి దీవి ప్రజలు అందరికంటే ముందుగా కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకే వాళ్లకు న్యూఇయర్ మొదలైపోయింది. కిరిబాటి దీవి తర్వాత న్యూజిలాండ్ కూడా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టింది. భారతీయ కాలమాన ప్రకారం 4.30 గంటలకు వాళ్లకు కొత్త సంవత్సరం మొదలయ్యింది. అద్భుతమైన ఫైర్‌వర్క్స్,



హోరెత్తించే మ్యూజిక్‌తో ఆక్లాండ్ ప్రజలు న్యూఇయర్‌కు వెల్‌కమ్ చెప్పారు. న్యూజిలాండ్ తర్వాత ఆస్ట్రేలియాలో కొత్త ఏడాది ప్రారంభం అవుతుంది. అక్కడ సాయంత్రం 6:30 గంటలకు న్యూఇయర్ మొదలవుతుంది. జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలో రాత్రి 8:30 గంటలకు, చైనా, మలేసియా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్‌లో రాత్రి 9:30 గంటలకు, థాయ్‌లాండ్, వియత్నాం, కాంబోడియాలో రాత్రి 10:30 గంటలకు న్యూఇయర్ మొదలవుతుంది. భారత్ తర్వాత 43 దేశాలు ఒకేసారి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతాయి. వాటిలో జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, ఇటలీ లాంటి ఐరోపా దేశాలతోపాటు కాంగో, అంగోలా, కామెరూన్ లాంటి ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. అయితే, చివరిగా మాత్రం అమెరికానే న్యూఇయర్‌కు స్వాగతం పలుకుతుంది

**2025కి ఘనంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్**

కొత్త సంవత్సర వేడుకలకు యావత్ ప్రపంచం సిద్ధమయింది. మన దేశంలో కూడా పూర్తిగా సందడి వాతావరణం నెలకొంది. 2025 సంవత్సరానికి న్యూజిలాండ్ ఘనంగా స్వాగతం పలికింది. న్యూజిలాండ్ రాజధాని ఆక్లాండ్ లోని స్కై టవర్ వద్ద న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ గ్రాండ్ గా జరిగాయి. మన కాలమానం ప్రకారం సాయంత్రం 3.45 గంటలకు న్యూజిలాండ్ కు చెందిన చాతమ్ ఐలాండ్స్ 2025లోకి అడుగు పెట్టింది. ఆస్ట్రేలియాలో మన కంటే ఐదున్నర గంటల ముందు కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. మన పొరుగు దేశాలు భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మనకంటే 30 నిమిషాల ముందు నూతన సంవత్సరంలోకి అడుగుపెడతాయి. రేపు ఉదయం మనకు 10.30 గంటలు అయినప్పుడు అమెరికాలోని న్యూయార్క్ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతుంది. రష్యాలో కొత్త సంవత్సర వేడుకలను రెండు సార్లు జరుపుకుంటారు. గ్రెగెరియన్ క్యాలెండర్ ప్రకారం జనవరి 1న.... పాత జూలియన్ క్యాలెండర్ ప్రకారం జనవరి 14న న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ జరుపుకుంటారు. సౌదీ అరేబియా, చైనా, ఇజ్రాయెల్, వియత్నాం దేశాలు జనవరి 1న కొత్త సంవత్సరాన్ని జరుపుకోవు. ఆయా దేశాల క్యాలెండర్ల ప్రకారం కొత్త సంవత్సర వేడుకలు జరుపుకుంటారు.

# అంతరిక్షంలో వ్యోమగాములకు 16 సార్లు న్యూఇయర్

విశ్వంపై కొత్త ఏడాది ప్రారంభమైంది. ఇప్పటికే కొన్ని దేశాలు 2025 ఏడాదికి ఘనంగా స్వాగతం పలికాయి. కిరిబాటి దీవి న్యూజిలాండ్ ప్రజలు కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టారు. అయితే, సాధారణంగా భూమ్మీద ఉన్న ప్రజలు కొత్త ఏడాదికి ఎన్నిసార్లు స్వాగతం పలుకుతారు..? ఒక్కసారే కద. అయితే, అంతరిక్షంలోని ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు మాత్రం 16 సార్లు ఈ అనుభూతిని సొంతం చేసుకుంటారట. అందుకు కారణం.. ఒక్కో దేశం ఒక్కోసారి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతాయి. ప్రపంచ దేశాల్లోని ప్రజలు 2025కు ఒకేసారి స్వాగతం పలకగలుగుతారు! కానీ వ్యోమగాములు మాత్రం 16 సార్లు కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు. అంతరిక్షంలో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ గంటకు 28 వేల కిలోమీటర్లు తిరుగుతుంది.

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ గంటకు 28 వేల కిలోమీటర్లు తిరుగుతూ 90 నిమిషాల్లో భూమిచుట్టూ ఒక రౌండ్ పూర్తి చేసుకుంటుంది. అంటే 24 గంటల్లో భూమిచుట్టూ 16 సార్లు తిరుగుతుంది. అందుకే వ్యోమగాములకు కొత్త ఏడాదికి 16సార్లు స్వాగతం పలికే అవకాశం ఉంటుంది. వ్యోమగాములు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సూర్యోదయాన్ని, ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సూర్యాస్తమయాన్ని చూస్తారు.

ఐఎస్ఎస్ గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతుండటమే. ఇంటర్నెషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్) గంటకు 28,000 కిలో మీటర్ల వేగంతో




తిరుగుతుంది. దీంతో 90 నిమిషాల్లో భూమి చుట్టూ ఒక రౌండ్ పూర్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి భూమిపై పగలు, 45 నిమిషాల తర్వాత రాత్రిని చూస్తారు. మరోవైపు ఐఎస్ఎస్ ఒక రోజులో భూమి చుట్టూ 16 సార్లు పరిభ్రమిస్తుంది. దీంతో అందులోని వ్యోమగాములు ప్రతి రోజు 16 సార్లు సూర్యోదయాన్ని, 16 సార్లు సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు కొత్త ఏడాదిని 16 సార్లు స్వాగతం పలుకుతారు. తద్వారా న్యూఇయర్‌ను 16 సార్లు సెలబ్రేట్ చేసుకునే అరుదైన అవకాశం వారికి లభిస్తుందన్నమాట.

## ఇవే ఈ ఏడాది ఆఖరి సూర్యాస్తమయాలు..
## వివిధ ప్రాంతాల్లోని అరుదైన దృశ్యాలు



'పరుగులు పెడుతది కాలమూ.. నీకోసం ఆగదు ఏ క్షణమూ' అన్నట్లుగా సెకన్‌లు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాలు.. ఇలా కాలం కదిలిపోతూనే ఉంటుంది. సూర్యోదయాలు, సూర్యస్తమయాలు ఒకదాని వెంట ఒకటి నిర్విరామంగా జరుగుతూనే ఉంటాయి. మనం ఎక్కడ ఆగినా కాలం మాత్రం ఎవరి కోసం ఆగకుండా పరుగులు పెడుతూనే ఉంటుంది. ఓ ఏడాది గడిచిపోతుంది. మరో సంవత్సరం కొత్తగా వచ్చి చేరుతుంది. ఇలా ఇప్పటివరకు క్రీస్తు శకంలో 2024 సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు ప్రపంచ దేశాలు 2025వ ఏడాదికి ఘనంగా స్వాగతం పలుకుతున్నాయి. న్యూజిలాండ్‌లో ఇప్పటికే నూతన సంవత్సరం సంబురాలు జరుగుతున్నాయి. మరికొన్ని గంటల్లో అన్ని దేశాల్లో కొత్త సంవత్సర సంబురాలు అంబరాన్ని అంటనున్నాయి. మనమూ సంబురాలకు కొన్ని గంటల దూరంలో ఉన్నాం. కానీ అంతకంటే ముందు 2024 ఏడాదికి సంబంధించి సూర్యుడు ఆఖరిసారి అస్తమిస్తున్నాడు. న్యూజిలాండ్ సహా తూర్పు దేశాల్లో ఇప్పటికే సూర్యుడు అస్తమించగా.. మన దేశంలోనూ ఈశాన్య రాష్ట్రాల్లో, అస్సాం, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో సూర్యుడు అస్తమించాడు. మరికొన్ని నిమిషాల్లో దేశమంతటా సూర్యుడు అస్తమించనున్నాడు. ఈ ఏడాది ఆఖరి సూర్యాస్తమయానికి సంబంధించి వివిధ రాష్ట్రాల్లో కెమెరాకు చిక్కిన అరుదైన దృశ్యాలను కింది వీడియోల్లో చూడవచ్చు..

## అతిషి, సంజయ్ సింగ్‌పై
## రూ.10 కోట్ల పరువునష్టం దావా



**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ నుంచి డబ్బులు తీసుకున్నట్టు తనపై ఆరోపణలు చేసిన ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌పై పరువునష్టం దావా వేయనున్నట్టు కాంగ్రెస్ నేత, ఈస్ట్ ఢిల్లీ మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్ తెలిపారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, బీజేపీ నుంచి తాను పెద్దమొత్తంలో డబ్బులు తీసుకున్నట్టు ఐదారు రోజుల క్రితం అతిషి ఆరోపించారని, గత 10-12 ఏళ్లుగా కాంగ్రెస్‌ను, తనను, తన కుటుంబాన్ని వాళ్లు టార్గెట్ చేసుకున్నారని తెలిపారు. తాను పది పన్నిండేళ్లుగా 'ఆప్'ను ఆనేక ప్రశ్నలు వేశానని, ఆయన (కేజ్రీవాల్) షీలా దీక్షిత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 360 పేజీల సాక్షాలున్నాయని చెప్పుకుని తిరిగే వారని వివరించారు. "కేజ్రీవాల్ సీఎం అయిన తర్వాత షీలా దీక్షిత్‌పై సాక్ష్యాలను అడుగుతూ బీజేపీ ప్రతినిధి బృందం ఆయనను కలిసింది. అరవింద్ కేజ్రీవాల్ 360 పేపర్ కటింగ్‌లు తమకు చూపించినట్టు బీజేపీ నేత విజయ్ కుమార్ మల్హోత్రా నాకు చెప్పారు. పేపర్ కటింగ్‌లను సాక్ష్యాలుగా చూపించిన మొదటి వ్యక్తి కేజ్రీవాల్" అని సందీప్ దీక్షిత్ తెలిపారు. బీజేపీ నుంచి తాను డబ్బులు తీసుకున్నట్టు అతిషి ఆరోపించిన రోజే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూశారని, దాంతో తాను మీడియా సమావేశం ఏర్పాటు చేయలేదని ఆయన చెప్పారు. ఈరోజు మీడియా సమావేశం పూర్తి కాగానే అతిషి, సంజయ్ సింగ్‌పై రూ.10 కోట్లకు సివిల్, క్రిమినల్ కేసులు వేస్తానని చెప్పారు. రూ.5 కోట్లు యమునా జలాల ప్రక్షాళన, ఢిల్లీలోని వాయుకాలుష్య నిరోధక చర్యల కోసం రూ.5 కోట్లు విరాళంగా ఇస్తానని తెలిపారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడైన సందీప్ దీక్షిత్.. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్‌పై న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.

**సంక్షేమ పథకాలపై విసుర్లు**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ 'ఆప్' ప్రకటించిన సంక్షేమ పథకాలను సందీప్ దీక్షిత్ సూటిగా ప్రశ్నించారు. "ఇప్పుడే ఈ సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేస్తున్నారు? ఇంతకుముందు ఎందుకు చేయలేకపోయారు?" అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు వాళ్లే అధికారంలో ఉన్నారనీ, ఆయన జైలుకు వెళ్లడంతో 17 నెలల మంచి సమయం వృథా చేశారని అన్నారు. ఆయన అంతకుముందే రాజీనామా చేసి పెండింగ్ పనులు పూర్తి చేసి ఉండొచ్చని అన్నారు. ఆయన తిరిగి సీఎం అయినా కూడా ఇచ్చిన వాగ్దానాలు, ప్రకటించిన పథకాలు, పనులు పూర్తి చేయడం సాధ్యం కాదని సందీప్ దీక్షిత్ అన్నారు.

## దల్లేవాల్‌కు వైద్య సహాయం..
## పంజాబ్ సర్కార్‌కు మరింత గడువు ఇచ్చిన సుప్రీం



**న్యూఢిల్లీ:** రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారంతో 36వ రోజుకు చేరుకుంది. ఆయనను వైద్య సహాయం అందించాలంటూ పంజాబ్ సర్కార్‌కు సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అయితే అందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను పంజాబ్ ప్రభుత్వం వివరిస్తూ తమకు మరింత గడువు ఇవ్వాలని కోరడంతో అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. తదుపరి విచారణను జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది. దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి, పంజాబ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జస్టిస్ సూర్యకాంత్, సుదాన్షు ధులియాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం సమీక్షించింది. పంజాబ్ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ హాజరయ్యారు. కోర్టు డిసెంబర్ 20న ఇచ్చిన ఆదేశాలు అమలుకు మరో మూడు రోజులు సమయం ఇవ్వాలని కోరారు. దల్లేవాల్‌ను సమీప ఆసుపత్రికి తరలించేందుకు నిరసన దీక్షా శిబిరం వద్ద రైతు నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు. వైద్య సహాయం అందిస్తామని ఈ నెల 29న వైద్యుల బృందం చెప్పినప్పటికీ దల్లేవాల్ నిరాకరించారని, బలవంతంగా తరలిస్తే ఇరువైపులా సమస్యలు తలెత్తవచ్చని గుర్మీందర్ కోర్టుకు విన్నవించారు. దీనికోసం మరింత సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. అందుకు అంగీకరించిన న్యాయస్థానం తుదపరి విచారణను జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం సహా పలు డిమాండ్లతో పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరి శిబిరం వద్ద దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీనిపై డిసెంబర్ 28న సుప్రీంకోర్టు విచారణ జరిపి పంజాబ్ సర్కార్‌పై మండిపడింది. దల్లేవాల్‌కు వైద్య సాయం అందకుండా రైతులు అడ్డుపడటం సరికాదని పేర్కొంది. డిసెంబర్ 31వ తేదీలోగా దల్లేవాల్‌ను ఒప్పించి ఆసుపత్రికి తరలించాలని ఆదేశించింది. అవసరమైతే కేంద్రం సాయం తీసుకోవాలని కూడా సూచించింది.

# కొత్త సంవత్సరం రోజున కేటీఆర్‌ను బాధ పెట్టవద్దు

-మొదటిపేజీ తరువాయి
షాకింగ్ కామెంట్స్ చేశారు. జలసౌధలో ఇవాళ(మంగళవారం) నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ పార్లమెంటు పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.
నల్గొండ ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్‌బీసీ(%ూాదీజ%) ప్రాజెక్ట్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని హెచ్చరించారు. కాంట్రాక్టర్ పని చేయకపోతే సంబంధిత మంత్రికి చెప్పాలన్నారు. దయచేసి అధికారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయొద్దని వార్నింగ్ ఇచ్చారు. అధికారులు సీరియస్‌గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చని చెప్పారు. %ూాదీజ% ప్రాజెక్ట్ 4 లక్షల ఎకరాలకు నీళ్లిచే ప్రాజెక్ట్ అని వివరించారు.
ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ... కొత్త సంవత్సరం రోజున కేటీఆర్ ను బాధ పెట్టవద్దని ఎద్దేవా చేశారు. న్యూ ఇయర్ ను ఎంజాయ్ చేయనివ్వాలని చెప్పారు. ఒక రెండు రోజులు ఎంజాయ్ చేయనిద్దామని... జనవరి 3, 4 తేదీల్లో కేటీఆర్ గురించి చూద్దామని వ్యాఖ్యానించారు.
నల్గొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ అని కోమటిరెడ్డి చెప్పారు. 4 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ నీరు ఇస్తుందని అన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పని చేయరని... కాంట్రాక్టర్లు పని చేయకపోతే మంత్రికి చెప్పాలని సూచించారు. అధికారులు సీరియస్ గా పని చేస్తే ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేయవచ్చని చెప్పారు. ఎస్ఎల్బీసీ ఒక వరల్డ్ వండర్ అని... ఇది పూర్తయితే ప్రపంచమంతా వచ్చి చూస్తుందని అన్నారు. ూాదీజ%, బ్రాహ్మణవెల్లాంల ప్రాజెక్టులు తనకు తొలి ప్రాధాన్యమన్నారు. %ూాదీజ% ఒక వరల్డ్ వండర్..



%ూాదీజ% పూర్తయితే.. ప్రపంచమంతా వచ్చి చూస్తుందని అన్నారు. అధికారులు చాలా బాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన బ్రదర్ 26 బోర్లు వేసినా నీళ్లు రాలేక వేసిన పంట వదిలేశారని.. నల్గొండ అంత విపత్కర పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. %ూాదీజ% ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి, డిప్యూటీ సీఎం అందరూ సపోర్ట్ చేస్తున్నారన్నారు. అమెరికా ఇంజనీర్లతో కలిసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏం కావాలన్నా చేసే మంత్రి ఉన్నారని గుర్తుచేశారు. చిన్న చిన్న సమస్యలతో పనులు ఆపడంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత ఆలస్యం అయితే. అంత ఖర్చులు పెరుగుతాయన్నారు. అమెరికన్ ఇంజినీర్లు ఆనాడు మిషన్ అమర్చిన రోజు మూడు రోజులు ప్రాజెక్ట్ దగ్గరే ఉన్నానని చెప్పారు. %ూాదీజ% పూర్తి అయితే, ఫర్ షోర్ నుంచి... నీళ్లు తీసుకోవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.
ప్రపంచంలోనే అతిపొడవైన నీటిపారుదల టన్నెల్ అని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కొట్లాడి తాను 2005లో పాలన అనుమతి ఇప్పించానని గుర్తుచేశారు. %ూాదీజ% పనులు మొదలు పెట్టామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు వృథా చేశారని మండిపడ్డారు. మార్చిలో %ూాదీజ% పనులు మొదలవుతాయని తెలిపారు. 20నెలల్లో టన్నెల్ తవ్వకం పనులు పూర్తి అవుతాయిని చెప్పారు. నల్గొండను రాబోయే నాలుగేళ్లలో ఉభయ గోదావరి జిల్లాలను మించి సస్య శ్యామలం చేస్తామని అన్నారు. ఆంధ్ర పాలకులే నల్గొండకు న్యాయం చేశారని చెప్పారు. పదేళ్లు నల్గొండ జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. వేముల ప్రశాంత్ రెడ్డి ఫామ్ హౌస్‌కు, ప్రగతి భవన్‌కు మంత్రిగా పనిచేశారని విమర్శించారు. ఆయనకు రోడ్ల గురించి ఏం తెలుసు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు.

**కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తిగా నిర్మాణం చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి...నామమాత్రం ఆయకట్టు మాత్రమే చేశారని చెప్పారు. పాలమూరు రూ.27వేలు, సీతారామ ప్రాజెక్టు రూ.8వేలు ఖర్చు చేసి ఒక్క ఎకరా ఆయకట్టు కూడా ఇవ్వలేదన్నారు. 800 టీఎంసీల తెలంగాణకు 299 టీఎంసీ, ఆంధ్రాకు 519 టీఎంసీ గతంలో ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 500 టీఎంసీ నీళ్ల కోసం సర్కార్ ఫైట్ చేస్తోందని చెప్పారు. సమక్క సారలమ్మ 44 టీఎంసీలు త్వరలోనే క్లియర్ కాబోతున్నాయన్నారు.. రాబోయే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో కొత్త ఆయకట్టు తేవాలని ముందుకు వెళు_న్నామని చెప్పారు. 18వందల లష్కర్‌లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించబోతున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు వచ్చే పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అధికారులు బాధ్యతగా ఉండకపోతే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ ఏఈనీ సస్పెండ్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ ఇక దూరమేనా?

-మొదటిపేజీ తరువాయి
ఎమ్మెల్యే హరీశ్ రావు కామెంట్ చేయడం వెనుక 'కేసీఆర్ ఇక సభకు ఎప్పటికీ రారు' అనే సంకేతాన్ని ఇచ్చారనే మాటలు వినిపిస్తున్నాయి. మన్మోహన్ సింగ్ మరణవార్త తెలిసిన వెంటనే సంతాప సందేశంలో ఆయన కృషిని కొనియాడిన కేసీఆర్, జరిగిన అంత్యక్రియలకు హాజరు కాకుండా కేటీఆర్‌ను పంపడం, కనీసం అసెంబ్లీలో జరిగే చర్చకైనా ఆయన హాజరు కాకపోవడం, ఈ సభ ఏం గౌరవం ఇచ్చిందంటూ హరీశ్ రావు కామెంట్ చేయడం, వీటన్నింటితో కేసీఆర్ ఈ సభకు హాజరయ్యే ఉద్దేశం లేదనే అంశాన్ని పరోక్షంగా చెప్పినట్లయిందనే మాటలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నుంచే వినిపిస్తున్నాయి. సభకు హాజరై ఉండి ఉంటే బాగుండేదని, అలా హాజరు కాకపోవడం ద్వారా విమర్శలకు తావు ఇచ్చినట్లయిందని, రాజకీయంగా బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల మధ్యే జరుగుతున్నాయి. మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానంపై చర్చలో భాగంగా కేసీఆర్ గురించి హరీశ్ రావు మాట్లాడుతూ ఉన్న సందర్భంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని నిర్దిష్ట అంశానికే పరిమితం కావాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పీకర్ వివరణ ఇస్తూ సంతాప తీర్మానంపై జరిగే చర్చలో పాల్గొనాల్సిందిగా స్వయంగా తానే కేసీఆర్‌కు ఫోన్ చేసి రిక్వెస్ట్ చేశానని అని సభకు తెలియజేశారు హరీశ్ రావు స్పందించి "ఆ విషయంలో మేం కూడా చాలా మాట్లాడాల్సి వస్తుంది.. ఈ సభ కేసీఆర్‌కు ఏం గౌరవం ఇచ్చింది? సభలో కేసీఆర్ మాట్లాడాలనే అనుకుంటున్నారు కానీ ఈ సభ ఒక సభ లాగా నడుస్తలేదు. పీఏసీ (పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ) చైర్మన్ నియామకం విషయంలో ఇష్టమొచ్చినట్లు నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్‌కు గౌరవం ఇచ్చి ఆయనను అడిగి



నిర్ణయం తీసుకున్నారా? పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న విషయంలో కేసీఆర్‌ను అడిగి నిర్ణయం తీసుకున్నారా?" అంటూ కామెంట్ చేశారు. మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలియజేసే తీర్మానంపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడిన మాటల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర గురించి ఎక్కువగా ప్రస్తావించడాన్ని ఇతర పార్టీల సభ్యులూ గమనించారు. రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ నాన్చివేత ధోరణి అవలంబించిందని, ఆలస్యం అవుతుండడంతో కేసీఆర్ ఒత్తిడి చేశారని, రాజీనామాలు కూడా చేయాల్సి వచ్చిందని, లాంటి మాటలతో బీఆర్ఎస్ ఈ సమావేశాలను రాజకీయంగా వాడుకునే ప్రయత్నం చేసిందనే అభిప్రాయమూ కొద్దిమంది ఎమ్మెల్యేలలో వ్యక్తమైంది. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లోమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఢిల్లీలో జరిగిన అంత్యక్రియలకు వెళ్ళకపోగా కనీసం అసెంబ్లీలోనైనా చర్చలో పాల్గొనకపోవడం వివాదాస్పదమైంది. మన్మోహన్ సింగ్‌తో కేసీఆర్‌కు ఉన్న అనుబంధం, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన యూపీఏ పట్ల ఆయనకు ఉన్న కృతజ్ఞత. చిత్తశుద్ధి ఇదేనా అనే మాటలూ గులాబీ ఎమ్మెల్యేల నుంచి వ్యక్తమయ్యాయి. ఇప్పుడు సభకు గైర్హాజరు కావడం బాధ్యతా రాహిత్యమే కాక నిర్లక్ష్యం కూడా అనే గుసగుసలూ ఆ పార్టీ నేతల నుంచే వినిపించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, వేలెత్తి చూపడం లాంటివి సంతాప తీర్మానాలపై జరిగే చర్చ సందర్భంగా ఉండవని తెలిసినా ఎందుకు రాలేదనేది కీలకంగా మారింది. ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన కామెంట్లలోని 'గౌరవం' అనే పదానికి అర్థమేంటి అనే చర్చ మొదలైంది. గౌరవం లేనందుకే సభకు రాలేదు అని సమర్ధించుకోవడంతో ఇకపైన ఎప్పటికీ సభకు కేసీఆర్ హాజరయ్యే ఉద్దేశం లేదా? ఈ విషయాన్ని హరీశ్ రావు తన కామెంట్ల ద్వారా చెప్పకనే చెప్పారా? హఠాత్తుగా ఈ టాపిక్‌ను ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చింది? సంతాపం తెలియజేయడానికి గౌరవానికి ఉన్న సంబంధమేంటి? తెలంగాణ వచ్చిన మన్మోహన్ సింగ్ హయాంలోనే అని చెప్తూనే సంతాప తీర్మానంపై చర్చలో ఎందుకు పాల్గొనలేదు? సీనియర్ సభ్యుడు, మాజీ సీఎం మాత్రమే కాకుండా ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగానూ ఉండి గైర్హాజరు కావడంలోని ఆంతర్యమేంటి?.. ఇలాంటివన్నీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే చర్చించుకుంటున్నారు. హాజరవుతానంటూ కొద్దిమంది సీనియర్ ఎమ్మెల్యేలకు పరోక్షంగా కేసీఆర్ సంకేతం ఇవ్వడంతో కచ్చితంగా వస్తారనే అభిప్రాయంతో ఉన్నారు. హాజరుకాకపోతే పార్టీకి నష్టం కలుగుతుందని, విమర్శలకు ఆస్కారం ఇచ్చినట్లవుతుందని, రాకపోవడం తప్పవుతుందని లాంటి మాటలూ వినిపించాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య జరిగిన అంతర్గత చర్చలు వారికి కేసీఆర్ వ్యవహారశైలిపై ఉన్న అసంతృప్తికి నిదర్శనంగా మారాయి.

# భూభాగోతాలకు చెక్

**వరంగల్ :** భూ సమస్యల పరిష్కారం, భూముల పరిరక్షణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. ఈ పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ధరణి కారణంగా చాలా మంది భూముల నమోదులో పొరపాట్లు జరిగాయి. ఎక్కువ తక్కువ భూములు నమోదయ్యాయి. సాగులో లేని భూములను కూడా సాగు భూములుగా చూపించారు. దీంతో రైతులు అధికారుల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నారు. సీసీఎల్ఏ కొన్ని సమస్యలు పరిష్కరించినా.. ఇప్పటికీ కలెక్టర్ల వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక చాలా ప్రభుత్వ భూములు నాయకుల పేరిట పట్టాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో భూ అక్రమాలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం అమలు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే అసెంబ్లీ, శాసన మండలిలో బిల్లు ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. గవర్నర్ ఆమోదించగానే చట్టంగా మారుతుంది. అయితే కొందరు అధికారుల తీరుతో భూ రికార్డుల్లో తప్పులు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. లంచాలకు ఆశపడి, ప్రభుత్వ పెద్దల మాటలు విని, బెదిరింపులకు భయపడి ఇతర కారణాలతో కొందరు అధికారులు రికార్డులు మారుస్తున్నారు. ఈ క్రమంలో భూ వివాదాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంతో భూ సమస్యలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. భూ భారతి చట్టాని రాష్ట్ర రెవెన్యూ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. అయినా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. భూముల వివరాలు తప్పుగా నమోదు చేసే అధికారులపై




క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చట్టంలో నిబంధన పొందుపరిచారు. ఏ అధికారి స్థాయిలో తప్పు జరిగితే ఆ అధికారిపైనే చర్యలు తీసుకునేలా చట్టం ఉంది. అవసరమైతే ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించేలా నిబంధన చేర్చారు. ఇందుకు ఐఏఎస్ ఆఫీసర్లు కూడా అతీతులు కాదని సెక్రటేరియేట్ వర్గాలు తెలిపాయి. ఇక భూ సమస్యలను చాలా వరకు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వీఆర్వోల స్థానంలో జే ఆర్వోలను నియమించాలని నిర్ణయించింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్వో ఉంటారు. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా జేఆర్వో వ్యవస్థను తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా4 11 వేల మందిని నియమించేలా కసరత్తు చేస్తోంది

## అప్పటి వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దు

-మొదటిపేజీ తరువాయి
ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు ముగిసిన అనంతరం హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. ఈ మేరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఇటీవల, క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అయితే దర్యాప్తును కొనసాగించవచ్చని ఏసీబీకి సూచించింది. పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ డిసెంబర్ 27కు వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణను నేటికి (డిసెంబర్ 31) వాయిదా వేసింది. ఈరోజు సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది.

## రైతు భరోసా మీద ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

**ఖమ్మం:** రైతు భరోసా మీద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి శివారు వ్యవసాయ క్షేత్రంలో ఇవాళ(మంగళవారం) మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. 21 వేల కోట్ల రుణామాఫీ, రూ.7,625 వేల కోట్ల రైతు బంధు, రూ. 3 వేల కోట్ల రైతు భీమా ఇచ్చిందని ప్రకటించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చామని స్పష్టం చేశారు. పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలనేదే స్థూలంగా తమ ప్రభుత్వం ఆలోచన అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మీద ఎలాంటి నిబంధనలు కానీ పంట వేయనటువంటి రైతులను తగ్గించటం కోసం చేసే ప్రయత్నం కానీ తమ ప్రభుత్వం ఇంత వరకు ఏ విధమైన ఆలోచన చేయలేదని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీ కేవలం విధి విధానాల మీద చర్చించడం మాత్రమే చేశామన్నారు. ఈ రోజు ఈ నిమిషం వరకు రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం చేయనటువంటి ప్రభుత్వంపై ప్రసార సాధనాల ద్వారా కానీ ప్రతి పక్షాలు దుష్ప్రచార చేసే ఆలోచన చేయొద్దని తెలిపారు. రైతు భరోసాపై తాము చేసిన చర్చల ఫలితాలను కేబినెట్‌లో పెడతామని అన్నారు. రైతు భరోసాపై కేబినెట్ నిర్ణయమే తుది నిర్ణయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## జనవరి 4న మంత్రివర్గ సమావేశం

-మొదటిపేజీ తరువాయి
కేబినెట్ చర్చకు రానున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. వీటితో పాటు కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**టీటీడీ తరహాలో యాదాద్రి బోర్డు**

యాదగిరిగుట్ట దేవాలయానికి టీటీడీ తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల శీతాకాలం సమావేశాల్లో అసెంబ్లీలోనూ చర్చించారు.
భూమి లేని పేదలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీనిని డిసెంబరు నెలలోనే అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించినప్పటికీ అది అమలు కాలేదు. వీటితో పాటు ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల ఎన్నికల లాంటి ప్రధాన అంశాలు చర్చకు రానున్నట్లు సమాచారం.

## అవినీతి అధికారులపై పంజా

**హైదరాబాద్ :** 2024లో ఎసిబి పంజా విసిరింది. ప్రధానంగా ప్రభుత్వ అధికారుల అవినీతిపై దృష్టి సారించింది. ప్రభుత్వంలోని ప్రధాన శాఖలపై దృష్టి సారించింది. అందుకనుగుణంగా రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) చర్యలు తీసుకుంది. 170 మంది ప్రభుత్వ అధికారులు దుష్ప్రవర్తన, లంచం తీసుకుంటూ ఎసిబికి అడ్డంగా దొరికిపోయారు. ఈ ఏడాది రాష్ట్రంలో అవినీతిపై ఎసిబి ఛేదించిన కేసుల వివరాలు, సమాచారాన్ని తాజాగా పంచుకుంది. అవినీతిలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖలు అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి డిఎస్పీ వరకు 31 మంది లంచం తీసుకుంటూ పట్టుబడగా, రెవెన్యూ శాఖలో 19 మంది అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖలో 13 మంది అధికారులు, మరో ప్రధాన శాఖగా పేర్కొనే పంచాయత్ రాజ్ శాఖలో 24 మంది అధికారులు ఎసిబి వలకు చిక్కిన వారిలో ఉన్నారు. ఇక, ప్రధాన కేసుల విషయానికొస్తే..కుషాయిగూడకు చెందిన పోలీసు ఇన్‌స్పెక్టర్, సబ్-ఇన్‌స్పెక్టర్ ఓ కేసును క్లోజ్ చేసేందుకు రూ. 3 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అలాగే హైదరాబాద్ సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. రూ. 3 లక్షలు అడ్వాన్స్ తీసుకుంటూ ఎసిబి అధికారులు చేతికి చిక్కాడు. అప్పటికే రూ. 5 లక్షలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సంగారెడ్డి ఇన్‌స్పెక్టర్ ఓ కేసులో రూ.1.5 కోట్లు డిమాండ్ చేశాడు. ముందుగా రూ. 5 లక్షలు పుచ్చుకుంటుండగా అడ్డంగా దొరికి పోయాడు. ఇక ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల విషయానికొస్తే? హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణపై ఎసిబి చర్యలు తీసుకుంది. అతని వద్ద 214 ఎకరాల భూమి, 29 ప్లాట్లు, బ్రాండెడ్ వాచ్‌లు, ఐఫోన్‌లు వంటి విలాసవంతమైన వస్తువులతో సహా రూ. 250 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించింది. నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వద్ద రూ.100 కోట్ల విలువైన ఆస్తులను కనుగొన్నారు. హైదరాబాద్ సిసిఎస్ ఎసిపి వద్ద రూ. 3.95 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు ఉన్నట్లు గుర్తించి, చర్యలు తీసుకుంది. అదే విధంగా శామీర్‌పేట తహశీల్దార్ రూ. 20 లక్షలు లంచం డిమాండ్ చేసి రూ.10 లక్షలు నగదు తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఎసిబి నిందితులుగా తేల్చిన 170 మంది ప్రభుత్వ అధికారుల్లో 12 మందిని దోషులుగా కోర్టు నిర్ధారించింది. వారికి 1-4 సంవత్సరాల వరకు జైలు శిక్షలు విధించింది.

## లిక్కర్ వ్యాపారం 1000 కోట్లపైనేనా

**హైదరాబాద్ :** కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టేందుకు కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాలంటే సంబరాలు అంబరాన్ని తాకాల్సిందే. తెలంగాణలో ఈసారి డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ సందర్భంగా భారీగా మద్యం అమ్మకాలు ఉంటాయని అంచనాలు వేస్తున్నారు. డిసెంబర్ 31న ఒక్కరోజే దాదాపు వెయ్యి కోట్ల రూపాయల మద్యం సేల్స్ అయ్యే ఛాన్స్ ఉందని ఎక్సైజ్ వర్గాలు భావిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో ఇయర్ ఎండ్ అవుతోంది. దీంతో సెలబ్రేషన్స్ కోసం అంతా రెడీ అయిపోతున్నారు. ఆరోజు ఎలా ఎంజాయ్ చేయాలి అనే దానిపై పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆరోజు చుక్క, ముక్క లేకుండా వేడుకలు జరగవు. మరీ ముఖ్యంగా మందుప్రియులు డిసెంబర్ 31న పీకల దాకా తాగి గడిచిన ఏడాది జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉంటారు. కొత్త ఏడాది కలిసి రావాలని కోరుకుంటూ వేడుకలు చేసుకుంటారు. దీంతో తెలంగాణలో డిసెంబర్ 31న మద్యం ఏరులై పారుతుంది. డిసెంబర్ 31న దాదాపు వెయ్యి కోట్ల లిక్కర్ సేల్ జరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. డిసెంబర్ 31న కొత్త ఏడాది వేడుకలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే మద్యం స్టాక్ డిపోల నుంచి వైన్ షాపులు, బార్లకు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2వేల 620 మద్యం దుకాణాలు ఉండగా.. 19 మద్యం డిపోల ద్వారా ప్రభుత్వం లిక్కర్ సరఫరా చేస్తోంది. మూడు రోజుల్లో దాదాపు 565 కోట్ల విలువైన మద్యం లిస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇవాళ మద్యం డిపోలకు సెలవు అయినప్పటికి.. డిసెంబర్ 31ను దృష్టిలో పెట్టుకుని లిక్కర్ స్టాక్ పంపిణీకి ఓపెన్ లో ఉంచారు. మొత్తంగా ఈ డిసెంబర్ 31న ఒక్కరోజే వెయ్యి కోట్ల అమ్మకాలు జరిగే అవకాశం ఉందని మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు న్యూఇయర్ సెలబ్రేషన్స్ నేపథ్యంలో మద్యం దుకాణాలు, కొనుగోళ్లపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ 31న మద్యం దుకాణాలను అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉండొచ్చంది. ఇక బార్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి 1 గంట వరకు తెరిచి ఉంచవచ్చని ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో న్యూఇయర్ ను లిక్కర్ పార్టీతో వెల్ కమ్ చెప్పేందుకు సిద్ధమయ్యారు మద్యం ప్రియులు.

## సంపాదకీయం

# కొత్త ఆశలతో స్వాగతం పలకండి

క్యాలెండర్ మారిపోయింది... కొత్త క్యాలెండర్ వచ్చేసింది.. కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టేశాం,,,. 2024కి వీడ్కోలు పలికి.. సరికొత్త ఆశలతో 2025ను ఆహ్వానించాము..గడిచిన క్షణాల నుంచి మంచిని తీసుకొని రాబోయే కాలం లో విజయాల వైపు నడిచేందుకు న్యూ ఇయర్ తీర్మానాల్లో భాగంగా వారి డైరీలో ప్రణాళికలు రాసుకుంటున్నారు.ఇప్పటి వరకు చేయాలనుకున్నవి చేయలేకపోవడానికి కారణాలను పరిశీలించుకొని ఇకపై వచ్చే రోజుల్లో అన్ని సక్రమంగా చేసుకునేలా తమ కు తాము సూచనలు చేసుకుంటున్నారు. కొందరు రోజూ ఉదయం వాకింగ్ చేయడం, ఇంకొందరు జిమ్‌కు వెళ్లడం, మరికొందరు పుస్తకాలు చదవడం, కొత్త భాషలు నేర్చుకోవడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం తదితర లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొత్త ఏడాది.. కొత్తగా స్టార్ట్ చేయాలి. అలవాట్లు, అభిరుచుల విషయంలోనూ కొన్ని రిజల్యూషన్స్ తీసుకోవాలి. అప్పుడే మన జీవితం కూడా కొత్తగా ఉంటుంది. వ్యక్తిగతంగానూ కొన్ని విషయాల్లో నియమాలు పెట్టుకోవాలి. లేదంటే కొత్త అనుకుంటూనే పాత రోతలోనే మిగిలిపోతాం. అందుకే మీలోని చెడును వదిలిపెట్టేయాలనే నియమం పెట్టుకోండి. రాబోయే ఏడాది దాన్ని సాధించడం కోసం కష్టపడాలి. వాటిని ఏదో రెండు మూడు రోజులు కాకుండా.. మీ మాటే శాసనంగా నిరంతరం ఫాలో అయితే మీకు మంచిది. మీ న్యూ ఇయర్ రిజల్యూషన్స్ మీ వ్యక్తిగత వృద్ధి కోసమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేలా చూసుకోండి.మీ ప్రియమైనవారితో మీ సంబంధాలను పెంచుకోండి. వారికి ప్రాధాన్యం ఇవ్వండి. మీకు విలువ ఇస్తున్నారు కదా అని వారిని లైట్ తీసుకోకండి. మీ కుటుంబం, స్నేహితులు లేదా సహోద్యోగులు కావచ్చు. వారితో మంచి రిలేషన్ ఏర్పరచుకోవడానికి సమయాన్ని, కృషిని పెట్టుబడిగా పెట్టడానికి ప్రయత్నించండి. ఇది మీ బంధాన్ని బలోపేతం చేస్తుంది. మీ మానసిక శ్రేయస్సుకు సానుకూలంగా దోహదం చేస్తుంది.కొత్త విషయాలను అన్వేషించడానికి, ప్రయత్నించడానికి, కొత్త అనుభవాలను పొందడానికి ట్రై చేయండి. ఇది జీవితానికి గొప్ప అనుభవాన్ని అందిస్తుంది. కంఫర్ట్ జోన్‌ను దాటి కొత్తదనం కోసం తలుపులను తెరిచి ఉంచండి. కొత్త అభిరుచిని కనుగొనండి. కొత్త విషయాలు తెలుసుకోండి. దానికోసం రీసెర్చ్ చేయండి. ఇది మీకు సబ్జెక్ట్ పెరిగేలా చేస్తుంది. అప్పుడు మీ మీద మీకు నమ్మకం పెరుగుతుంది.ఈ ఆధునిక జీవితంలో పర్యావరణంపై ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. ప్రయత్నం చిన్నదైనా పర్యావరణంపై శ్రద్ధ పెట్టడం చాలా అవసరం. అలాగే మీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను మంచి కోసం ఉపయోగించండి. ఆన్‌లైన్‌లో ఉన్నవన్నీ నిజం కాదని గుర్తుంచుకోండి. అందులోని మంచిని మాత్రమే స్వీకరించాలి. మంచి కంటెంట్‌ను మాత్రమే షేర్ చేయండి. వీలైతే సోషల్ మీడియా తక్కువగా వాడండి.జీవితంలో ఎల్లప్పుడూ ఆరోగ్యమే మీ ప్రాధాన్యతగా ఉండాలి. వచ్చే ఏడాది సమతుల్యమైన, మరింత అనుకూలమైన జీవనశైలిని అనుసరించడానికి ప్రయత్నించండి. వ్యాయామం కోసం ఓ అరగంట కేటాయించండి. మీ మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. ఇది మీ శరీరంలో శ్వాస నియంత్రణ, జ్ఞాపకశక్తి మెరుగుపరుస్తుంది. అలాగే ఆర్థికంగా నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇందుకోసం ఖర్చులను తగ్గించుకోండి. కష్టపడి పని చేయాలి, లక్ష్యాల కోసం నిజాయితీగా ప్రయత్నించాలి. వ్యూహాత్మక ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలి. కుటుంబ సభ్యుల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా పొదుపు, ఖర్చు గురించి తెలియజేయండి. కొన్ని స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. సంపద పెరుగుతుందనుకునే విషయాల్లో పెట్టుబడులు పెట్టండి.మరో ముఖ్యమైన విషయం కొత్త ఏడాది అంటే పార్టీలు మాత్రమే కాదు. మత్తులో ఊగిపోవడం అంతకన్నా కాదు. రాబోయే ఏడాది జీవితం ఎంత అందంగా ఉండాలని మీరు కోరుకున్నా? మీ చుట్టూ ఉన్న పరిస్థితులు అందుకు దోహదపడాలి. చుట్టూ చీకట్లు అలముకుని ఉంటే మీరొక్కరే వెలుగులో బతకడం అసాధ్యం. కనుక సమాజాన్ని పట్టిపీడుస్తున్న అంధకారాన్ని పారద్రోలడం కూడా మన లక్ష్యాల్లో ఓ భాగంగా ఉండాలి. ఈ ఏడాదిలోనైనా ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేస్తామంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతుండటం విశేషం.

# ఆధునిక భారతదేశానికి రూపశిల్పి మీనన్

ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్. వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కర ణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడంలో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. బ్రిటీష్, భారతీయ అధికారులచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలంలోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్స రాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగంలో చేరాడు.1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు.



స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాలయంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహిం చాడు. 1942–47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు.1947–51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమించ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళి కకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొం దించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధించిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం.

భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నాయ ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా అంగీక రించారు. మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడంపై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహరించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారితీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

# బుడ్డా వెంగళరెడ్డి వర్ధంతి

కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలోని ఉయ్యాలవాడ గ్రామం ఇరువురు విశిష్ట వ్యక్తులకు జన్మ స్థలంగా నిలిచింది. బ్రిటిషు వారి నెదిరించి 1846లో ఉరికంబ మెక్కిన ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఒకరైతే, 1900 సంవత్సరంలో తుది శ్వాస వరకూ మూర్తీభవించిన దాతృత్వంగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి మరొకరు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారితో పోరాడి పేరు తెచ్చుకుంటే, ప్రభు త్వంతో సఖ్యతగా మెలుగుతూనే ప్రజలకు సేవ చేశాడు అదే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగళరెడ్డి. తన దాతృ త్వంలో అప్పటి బ్రిటీష్ రాణి క్వీన్ విక్టోరియానే ఆకట్టుకున్న వ్యక్తి బుడ్డా వెంగళరెడ్డి. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని 'రేనాడు సూర్యుడు' అంటారు. బుడ్డ వెంగళ రెడ్డిని 'రేనాటి చంద్రుడు' అంటారు. సిపాయిల తిరుగుబాటుకు ముందే తెల్ల దొరల తలలు తెగిన అరివీర భయం కరుడు నరసింహారెడ్డి అయితే ఎముకలేని చేయి కలిగి అభినవ దానకర్ణుడు అని పేరెన్నిక గన్నారు వెంగళ రెడ్డి.

బుడ్డా వెంగళరెడ్డి (జనవరి 1, 1840 – డిసెంబరు 31, 1900) కర్నూలు జిల్లా, ఉయ్యాలవాడ గ్రామంలో సంపన్న రైతు కుటుం బంలో నల్లపురెడ్డి, వెంకటమ్మ దంపతులను జన్మించారు. పెద్దగా చదవక పోయినా తల్లినుండి దానగుణాన్ని, దాని గొప్పదనాన్ని గ్రహించారు. సంతానం కలుగ నందున తన తమ్ముని కుమారుని దత్తత తీసుకున్నారు. బాల్యం నుండే దానగుణం ఆయన వెంట నడిచింది. ఆపన్నులకు ఆసరా అందించడమే ఆయనకు నిత్య కృత్యంగా మారింది. కరవు బారిన పడిన పేదలకు తన ఆపన్న హస్తం చాచి కడుపు నిండా అన్నం పెట్టి కలియుగ దానకర్ణుడని పేరుపొందిన బుడ్డా వెంగళరెడ్డి. తనకు ఉన్నాదంతా దానం చేసిన మహానుభావుని దాతృత్వానికి పరాయి పాలకులు సైతం ఆశ్చర్య పోయారు. అందుకే విక్టోరియా మహారాణి ఆయన సేవలను గుర్తించి బంగారు పతకాన్ని బహుమానంగా



ఇచ్చింది. బుడ్డ వెంగళరెడ్డి (1840 – 1900) 1866 కాలంలో సంభవించిన డొక్కల కరువు కాలంలో తన ఆస్తినంతా ధారపోసి ఎంతోమంది ప్రాణాల్ని కాపాడిన మహా దాత. పలు ప్రాంతాల నుండి తండోప తండాలుగా ఉయ్యాలవాడ చేరి రెడ్డిని ఆశ్రయించారు. వారి దీన స్థితిని అర్థంచేసుకున్న రెడ్డి ఇంట్లో ఉన్న ఆరు పుట్ల ధాన్యాన్ని గంజి కాయించి వేలాది కుటుంబాల ఆకలి తీర్చారు. పూటకు ఎనిమిది వేలకు తక్కువ కాకుండా ఈ కరవు కాలంలో బుడ్డ వెంగళరెడ్డి కరవు పీడితులైన ప్రజలకు మూడు నెలల పాటూ అన్న వస్త్రాలు ఇచ్చి కన్న తండ్రి లాగా కాపాడాడు. రాయల సీమలో పుట్టిన అపర దానకర్ణుడు వెంగళరెడ్డి. వంటమనిషి గంగన్న ఆకాలంలో చేసిన సేవలకు మెచ్చిన రెడ్డి అతనికొక బంగారు కడియం తొడిగి సత్కరించారు. అనంతర కాలంలో స్వగ్రామంలో పాఠశాలను నెలకొల్పి విద్యాదానం చేశారు. రెడ్డి సేవలను గుర్తించి విక్టోరియా బంగారు పతకాన్ని బహూక రించింది. ఢిల్లీలో 1877 జనవరి 1వ తేదీన జరిగిన సన్మాన సభలో బంగారు పతక బహూకరణ జరిగింది. ఆ బంగారు పతకముపై క్రింది విధంగా చెక్కబడింది. "1866వ సంవత్సరంలో సంభవిం చిన క్షామకాలమందు, నిరాధా రంగా నుండిన, తన స్వదేశస్థుల పట్ల జరిపించిన ఉత్కృష్ట ఔదార్యం నకు హర్ మైజెస్టి రాణిగారి వల్ల చేయబడిన శ్రేష్టమైన గణ్యతకు ఆనవాలుగా బుడ్డా వెంగళరెడ్డి గారికి బహుమాన మివ్వబడినది." ప్రభుత్వం ఈయన్ను ప్రొవిన్సియల్ జ్యూరీ యొక్క సభ్యునిగానూ, మద్రాసు గవర్నరు కౌన్సిల్ గౌరవ సభ్యుని గానూ చేసింది. ఆయన చేసిన దానాలు అపూ ర్వాలు, అసమానాలు, నిత్య జ్ఞాపకాలు. రెడ్డి ప్రతి సంవత్సరం శివరాత్రి నాడు స్వగ్రామంలోని అగస్తేశ్వర దేవాలయంలో ఉత్సవాలు జరిపి, పండితులను సత్కరించి, అన్న దానాలు చేసేవారు. మహాదాతగా పేరుగాంచిన వెంగళ రెడ్డి 1900 డిసెంబరు 31న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన కీర్తి ఆచంద్రతారార్కంగా నిలుస్తుంది. ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలు వివిధ జానపద కళలలో ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తుం టారు. వెంగళరెడ్డి దాతృ త్వమూ కావ్యవస్తువు అయ్యింది. జాన పదులు వెంగళరెడ్డి మీద పాటలు కట్టి పాడుకున్నారు. కవులు, రచయి తలు కావ్యాలు, నవలలు, నాట కాలు, బుర్రకథలు రచిం చారు. ఎందరో పరిశోధనలు చేశారు. బుడ్డా వెంగళరెడ్డి దాన గుణం , గొప్పతనం గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# వైవిధ్య భరిత భారతంలో నూతన సంవత్సర వేడుకలు

భిన్నత్వంలో ఏకత్వం సువిశాల సుందర భారత జన నందన వనం. ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు వేరైనా నా భరతమాత కంఠాన చేరిన పలు పుష్పాలు ఏరి కూర్చిన అలంకరించిన సుగంధ మాల. ఇక్కడి వైవిధ్యత స్వదేశీయులకు గర్వకారణం, విదేశీయులకు ఈర్ష్యాజనకం. ఆధునిక పాశ్చాత్య సమాజం ప్రతి ఏట ఘనంగా జరుపుకునే 2025 నూతన సంవత్సర వేడుకలు నేడు ప్రపంచవ్యాప్తంగా బహుళ ప్రచారంలోకి రావడం, భారతీయులు కూడా ఈ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకోవడం చూస్తున్నాం. 1582లో రోమన్ క్యాథలిక్ చర్చ్ 'పోప్ గ్రిగోరీ' స్థాపించిన గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏట 31 డిసెంబర్, 01 జనవరి రోజుల్లో గడిచిన 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, రానున్న 2025 నూతన సంవత్సరానికి ఆహ్వానం తెలుపుతూ వయోభేదం లేకుండా పిల్లలు, పెద్దలు అందరూ కలిసి ఆ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది. నూతన సంవత్సర దినం రోజు ప్రభుత్వ సెలవు కానప్పటికీ ఇండియాలో ఆపాలగోపాలం 31 డిసెంబర్ రాత్రి నుంచి 01 జనవరి వరకు ఉత్సవాలు, పార్టీలు, సినిమాలు చూడడం, టివీ కార్యక్రమాలను తిలకించడం, కేకులు కట్ చేయడం, రెస్టరెంట్లు/రిసార్టుల్లో గడపడం, నూతన వస్త్రాలు ధరించడం, దేవాలయాలు/చర్చిలకు వెళ్లడం, నూతన సంవత్సర వేళ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం లాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయి.

**సువిశాల భారతంలో వివిధ వైవిధ్యభరిత నూతన సంతవత్సర వేడుకలు:**

భారత దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలు, సాంప్రదాయాలు, భాషల 1.42 బిలియన్ల జనులు చాంద్ర మాన క్యాలెండర్ ప్రకారం తమ తమ నూతన సం వత్సర పండుగలను పంటలు కోసే సీజన్‌లో నిర్వహించుకోవడం అనాదిగా ఆనవాయితీగా వస్తున్నది. తెలుగు, కన్నడ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను "ఉగాది పండుగ" రూపంలో జరుపుకుంటున్నారు. అదే విధంగా పంజాబీలు "బైసాకీ పండుగ"ను, గుజరాతీలు "బెస్తు వరస్ పండుగ"ను, బీహార్/ఝార?ండ్‌లో "జూడె శీతల్"ను, ఈశాన్య రాష్ట్రాలు "బోహగ్ బిహూ పండుగ"ను, మహారాష్ట్రలో "గుడి పడ్వా పండుగ"ను, సింధీలు "చెట్టీ ఛాంద్? పండుగ"ను, కాశ్మీరీ హిందువులు "నవ తేజ్ పండుగ"ను, పార్సీలు "జెమ్షేడీ నవ్రోజి పండుగ"ను, కేరళలో "విషు పండుగ"ను, తమిళ నాడులో "పుతండు పండుగ"ను, ఒడిసాలో "పాన సంక్రాంతి పండుగ"ను, అస్సాంలో "బోహగ్ బిహూ పండుగ"ను, ముస్లిమ్‌లు హిజ్రీ క్యాలెండర్ ప్రకారం తమ తమ నూతన సంవత్సర పండుగలను ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ కొత్త సంవత్సర వేడుకలతో పాటు 'గ్రిగోరియన్ క్యాలెండర్' ప్రకారం 01 జనవరి రోజున కూడా "న్యూ ఇయర్ డే" వేడుకలను ఘనంగా జరుపుకోవడం విశేషం.

**2024 సింహావలోకనం – 2025లో చేపట్టవలసిన సత్కార్యాల తీర్మానాలు చేసుకుందాం:**

భారత దేశవ్యాప్తంగా గ్రామాల నుండి మహానగరాల వరకు నూతన సంవత్సర వేడుకలను 31 రాత్రి నుంచి 01 జనవరి వరకు నిర్వహించుకోవడం, ఏటేటా ఈ సంస్కృతి పెరిగి పోవడం, పలు సందర్భాల్లో పరిధిలో దాటడం గమనిస్తున్నాం. మనకే స్వంతమైన నూతన సంవత్సర వేడుకల నిర్వహణను నిర్లక్ష్యం చేయకుండా వాటిని ఘనంగా జరుపుకుంటూనే 01 జనవరి "న్యూ ఇయర్ వేడుక"లను కూడా జరుపుకుందాం. 2024లో మనం సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ, 2024 వైఫల్యాల నుంచి గుణపాఠాలు నేర్చుకుంటూ, 2025లో మనం చేపట్టవలసిన కార్యాలను నిర్ణయించుకొని, సాఫల్య సిద్ధికి సకల శక్తియుక్తులను ఒడ్డి ప్రతి ఏటా ఆశించిన స్థాయిలో ముందడుగు వేద్దాం, మనం ఎదుగుతూ మన దేశాభివృద్ధికి ఊతం ఇద్దాం.

**పెరుగుతన్న పాశ్చాత్య వింత పోకడలు:**

"పొరుగింటి పుల్ల కూర రుచి"గానే ఉంటుందని, "ఘర్‌కా మర్గీ దాల్ కీ బరాబర్" అవుతున్నదని గమనించి మన సంస్కృతులను కాపాడుకుంటూనే ఇతరుల వేడుకల్లో సహితం పాల్గొందాం. మన మహానగరాలు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదు లాంటి నగరాల వీధులు 31 డిసెంబర్ రాత్రి యువతతో నిండి పోవడం, బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకోవడం, పిచ్చి ముదిరి అతిగా ఆల్కహాల్ సేవించి వాహనాలు నడపడం లేదా నడి వీధుల్లో వికారమైన నృత్యాలు చేయడం, పబ్బుల్లో గబ్బు పనులు చేయడం లాంటి విపరీతాలను చూస్తున్నాం. పర్వదినాలు, వేడుకలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఇతరులు అసహ్యించుకునే దుస్థితిలోకి జారవద్దని గమనిద్దాం. మన ప్రవర్తన మన వారినే ఇబ్బంది పెట్టే విధం ఉండకూడదని గమనిద్దాం.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి





**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,డిసెంబర్ 31(సూర్యరేఖ)**విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతపూర్ లోని స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కళాశాల యాజమాన్యాలు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ సురేష్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సాయి జెన్ శేఖర్, ప్రశాంత్ గౌడ్ పవన్, సూరం శంకర్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గత ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత.






**హెచ్ బి కాలనీ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు..**

**కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్**

**ఉప్పల్,డిసెంబర్31(సూర్యరేఖ)** మీర్ పెట్ హెచ్ బీ కాలనీ ఫేజ్-1 గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించారు. అనంతరం హౌసింగ్ బోర్డు పాస్టర్స్ ఫెలోషిప్ పాస్టర్ లతో కలిసి కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...తెలంగాణా రాష్ట్ర గత ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వమే ముందుండి అధికారికంగా పండగలు నిర్వహించిందని,అదే క్రమంలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ సాంప్రదాయన్ని కొనసాగించడం మత సామరస్యానికి నిదర్శనమన్నారు.ఇక ముందు ఆ యేసు ప్రభు మనందరిని కరుణించి ఎలాంటి ఆపద రాకుండా, అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని కోరారు.ముఖ్య ప్రసంగీకులు పాస్టర్ పవన్ కుమార్ వేమూరి,బిషప్ రెవరెండ్ డాక్టర్ జేకరయ్య,బిషప్ రెవరెండ్ డాక్టర్ దేవదానం,రఘుయెల్ రాబర్ట్, డివిజన్ చర్చిల పాస్టర్లు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న సుమారు 750 డివిజన్ పరిధిలోని చర్చిల సంఘ సభ్యుల కోసం భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, స్థానిక కాలనీల నాయకులు పాల్గొన్నారు.

## నేడు భారత యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం పునఃప్రతిష్ఠ


**అధ్యక్షులు బజార్ అర్జున్ గౌడ్**



**ఉప్పల్,డిసెంబర్ 31(సూర్యరేఖ)** ఉప్పల్ భారత యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ కాంస్య విగ్రహం పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారత యువజన సంఘం అధ్యక్షులు బజారు అర్జున్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.గ్రామ పెద్దలు,వివిధ రాజకీయ నాయకులు,సంఘ పెద్ద మనుష్యుల కమిటీ సభ్యులు,ముఖ్య సలహాదారులు,కార్యవర్గ సభ్యులు, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని బజారు అర్జున్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## రామంతపూర్ రాజేంద్రనగర్..జోరుగా దొంగతనాలు బేజారు అవుతున్న జనాలు

### ఉప్పల్ సిఐకి ఫిర్యాదు చేసిన కాలనీవాసులు




**ఉప్పల్,డిసెంబర్ 31(సూర్యరేఖ)** గత కొన్ని రోజులుగా రామంతపూర్ డివిజన్ రాజేంద్రనగర్ లో గత కొన్ని రోజులుగా తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.మంగళవారం కాలనీవాసులు ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డిని కలిసి ఈ మేరకు తరచూ జరుగుతున్న దొంగతనాలపై ఫిర్యాదు చేశారు.గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి తర్వాత ఇండ్లలో చొరబడి దొరికినంత దోచుకుని వెళుతున్నారని,సోమవారం తెల్లవారుజామున వేముల తిరుపతయ్య అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి వాటర్ ట్యాంక్ పై ఉన్న ఎలక్ట్రిక్ మోటార్ దొంగిలించడం జరిగిందని,ఇతర సామాన్లు కూడా పోయాయని,కాలనీలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులలో పెట్రోలు దొంగిలిస్తున్నారని,అలాగే అర్ధరాత్రి రోడ్లపై నిలబడి చాలా న్యూసెన్సు చేస్తున్నారని కాలనీవాసులు సిఐకి వివరించారు. కాలనీలో పెట్రోలింగ్ పెంచాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.రాజేంద్రనగర్ కాలనీవాసులు, మహిళలు సావిత్రి,పద్మ,గౌరీ, సుశీలమ్మ,వేముల తిరుపతయ్య,వెంకటేశ్వర్లు,రాజేష్,ఈశ్వరరావు, రాజేష్ భాస్కర్ తదితరులు పాల్గొని సీఐకి ఫిర్యాదు చేశారు.

## దేశానికి అన్నం పెట్టి నా తెలంగాణలో బిడ్డల ఏడుపులా...కేటీఆర్



**హైదరాబాద్,డిసెంబర్ 31(సూర్యరేఖ)** రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దూషణలు కొనసాగుతూనే ఉన్నాయి. గురుకుల పాఠశాలలో సరైన భోజనం లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారంటూ మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసీఆర్ పాలనలో అన్నపూర్ణగా నిలిచిన తెలంగాణలో నేడు ఆకలికేకలు వినిపిస్తున్నాయని విమర్శించారు. గురుకులాల్లో చదువుకుని ఎంతో ఎత్తుకు ఎదిగిన విద్యార్థులు..నేడు ఆకలి బాధతతో అల్లాడిపోతున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు.ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ..“అన్నపూర్ణ నా తెలంగాణలో బువ్వకోసం బిడ్డల ఏడ్పులా ! కోటీ 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన నా తెలంగాణలో పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనాదాలా ! దశాబ్దాల కాంగ్రెస్ పాలన మూలంగా ఆకలిచావులు,ఆత్మహత్యలు,వలసలు, అంబలి కేంద్రాలకు నిలయమైన తెలంగాణను పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలిపాం. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నమో రామచంద్రా అని ఆకలికేకలా ! పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకులాల్లో చదువుకుని ఎవరెస్ట్ శిఖరాలు అధిరోహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులు ..నేడు గుప్పెడన్నం కోసం గుండెలవిసేలా రోదించడమా ! సిగ్గు సిగ్గు..ఇది పాలకుల పాపం. విద్యార్థులకు శాపం.జాగో తెలంగాణ జాగో” అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## పరమేశ్వర్ రెడ్డిని కలిసిన రామంతాపూర్ కురుమ సంఘం నాయకులు..



**ఉప్పల్,డిసెంబర్31(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని రామంతాపూర్ కురుమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.రామంతాపూర్ కురుమ సంఘం,బీరప్ప దేవాలయ కమిటీ,ఎల్లమ్మ దేవాలయ కమిటీ,రామంతాపూర్ కురుమ యూత్ నూతన కమిటీలు నియామకం ఇటీవల జరిగింది.దీంతో ఆయా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం పరమేశ్వర్ రెడ్డిని కలిశారు.ఈ కార్యక్రమంలో రావుల జంగయ్య,రేవు కృష్ణయ్య,శగా శ్రీధర్,బండ అంజయ్య,శగా శ్రీనివాస్,శగా రవీందర్,కవిడే శ్రీశైలం,బాలం బిక్షపతి,రేవు పరంధామ రేవు బీరప్ప,కంకల్లా వెంకటేష్,కవిడే యాదయ్య,శ్రీధర్,బలం శ్రీనివాస్,రావుల మహేష్ పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్,డిసెంబర్ 31(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు.ఏ.ఎస్ రావునగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ రూపోందించారు.కార్యక్రమంలో ఏఎస్.రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాశెట్టి ప్రసాద్,అజీజ్,లింగం,సుంకు శ్రీకాంత్ రెడ్డి,భూపాల్ రెడ్డి,మామిడి శ్రీనివాస్, అనిల్, పశ, చందు,తదితరులు పాల్గొన్నారు.

## కవితా శీర్షిక:

## కోటి ఆశల “కొత్త సంవత్సరం”

**నిజాంపేట,డిసెంబర్31(సూర్యరేఖ)**



నూతన సంవత్సరమా శుభ స్వాగతం
ప్రజల ఆశలను ఆశయాలు నెరవేర్చు
సకాలంలో వర్షాలు కురిపించి, రాష్ట్రం
సుభిక్షంగా ఉండేలా చూడు.. ఓ ఆంగ్ల
సంవత్సరమా.. నిరుద్యోగులకు ఉద్యో
గాలు కల్పించు పారిశ్రామిక రంగాన్ని
అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అగ్రగా మిగా
నిలుపు.. రైతులకు గిట్టుబాటు ధర
కల్పించి వ్యవసాయ రంగానికి చేయూ
త నివ్వు ఉద్యోగులకు వరాలు కురిపిం
చు అన్ని వర్గాలను సంతృప్తి పరుచు..
సంక్షేమ పథకాలు అందరికీ అందిం
చు అప్పులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దు.
మూడు కోట్ల ప్రజల ఆకాంక్షబంగారు
తెలగా ణ కల సాకారం చేయు..

రచన:
యాడవరం చంద్రకాంత్ గౌడ్
తెలుగు పండిట్
జడ్పీ స్కూల్,రాంపూర్

# గడువు తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి..





**నిన్నటి వరకు జిల్లాలో 72 శాతం సర్వే పూర్తి..**

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం,డిసెంబర్ 31(సూర్యరేఖ)** ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను స్వయంగా నమోదు చేస్తున్న జిల్లా పాలన అధికారి రాహుల్ రాజ్ కొల్చారం మండల పరిధిలో చిన్న ఘనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్న తీరును మంగళవారం జిల్లా పాలనాధికారి రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఇంటింటికి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్న వివారాలు సంబంధిత డాక్యుమెంట్లను సేకరించి మొబైల్ యాప్ ద్వారా అడుగుతున్న అన్ని కాలమ్స్ కరెక్టుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సర్వేలో మూడు ఫోటోలు తీసుకోవడం జరుగుతుంది.ఒకటి ఇంటి యజమాని,రెండవది ఇంటిలోపల, మూడవది ఇంటిబయట.సర్వేయర్ సరిగా ఇంటిలోపల ఫొటో సరిగా తీయకపోవడంతో స్వయంగా జిల్లా పాలనాధికారి ఫొటో తీసి వివరాలను నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా జిల్లాలో ఒక లక్ష 91 వేల దరఖాస్తులు ప్రజాపాలన పెట్టుకోవడం జరిగిందని, నిన్నటి వరకు72 శాతం సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు.మిగితా 38 శాతం గడువు తేదీలోపు పూర్తి చేయాలనీ సంబంధిత ఎంపీడీవో లు,ప్రత్యేక అధికారులు,నిర్దేశం చేసి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సర్వేను సర్వేయర్ లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని,సర్వే చేసేటప్పుడు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు తీసుకోవాలని,ఇందిరమ్మ కమిటి సభ్యులు తప్పకుండా ఈ సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వేకు సంబంధించిన ప్రతి అవసరం ఉన్న డాక్యుమెంట్లను ఇంటి సభ్యులు చూపించి సర్వే సాఫీగా జరిగేందుకు సహకరించాలని అన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కూడా ఈ సర్వే పూర్తి చేయాలనీ ఆదేశించారు.సర్వే అనంతరం ఐదు శాతం ఎంపీడీవో లు మున్సిపల్ కమిషనర్ లు సూపర్ చెక్ చేయడం జరుగుతుందని,సర్వేలో పేరు , వివరాలు, ఫొటో, తదితర సరిగా ఉందా లేదా చెక్ చేసిన తరువాత ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు మొదటి విడత,రెండో విడతలలో అర్హులు ఎంత మంది ఉన్నారో వారికి ఇందిరమ్మ ఇల్లు మంజురయ్యే అవకాశం ఉంటుందని,ఈ సర్వేకు మీరందరూ సహకరించాలని అన్నారు.ఇందిరమ్మ కమిటీ పంచాయతీ సెక్రటరీలు గడువులోగా సర్వే పూర్తి చేయాలని తెలిపారు.



కొల్చారం మండలం గ్రామాలలో సందర్శించి ఇప్పటి వరకు ఎన్ని నమోదు చేశారని అడిగి తెలుసుకొని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, తొందరపాటుగా కాకుండా జాగ్రత్తగా తప్పులు జరుగకుండా నమోదు చేయాలని,మొబైల్ యాప్ లో నమోదు తీరును ప్రత్యక్షంగా పరిశీలించి,ఏమైనా సమస్యలున్నాయా అని కలెక్టరు అడుగగా,యాప్ స్పీడ్ గానే ఉందని,ఫోటోలు సేవ్ అవుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.యాప్ లో సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో ఈడియం సందీప్ అడిగి సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు.కలెక్టర్ వెంట కొల్చారం ఎంపీడీవో కృష్ణవేణి, సర్వేయర్లు,పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భవ దినోత్సవం..

**నూతన విద్యా విధానం 2020 రద్దు చేయాలి..**

**పెండింగ్ స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి..**

**ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు బోడో వంశీ**




**ఇబ్రహింపట్నం,డిసెంబర్31(సూర్యరేఖ)** ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర ప్రజాస్వామ్యం సోషలిజం జెండాను ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ ఎగరవేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మస్కు చరణ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎస్ఎఫ్ఐ 1970లో కేరళలో ఏర్పడి ఇప్పటివరకు విద్యారంగ సమస్యల పైన అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత ఎస్ఎఫ్ఐ అని తెలిపారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకోసం,ప్రభుత్వ పాఠశాల, కళాశాల లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. దేశంలో శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.నూతనంగా ఏర్పడ్డ బిజెపి ప్రభుత్వం విద్యలో మతోన్మాదాన్ని, కాషాయకరణను తీసుకొచ్చి పూర్తిగా విద్యా వ్యవస్థను నాశనం చేశారు.నూతన విద్యా విధానం 20-20 తీసుకువచ్చి విద్యలో కులాన్ని,కుల వృత్తులపరంగా పాఠ్యాంశాలు చేర్పిస్తున్న పరిస్థితి ఉంది.ఈ నూతన విద్యా విధానం వలన ప్రైమరీ విద్యకు పేద విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలియజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న విద్యార్థులకు నిరాశే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంది. దాదాపు విద్యార్థులు రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 8700 కోట్లు పైచిలుకు పెండింగ్లో ఉన్న పరిస్థితి ఉంది.ఇంతవరకు కూడా విద్యారంగం పైన స్కాలర్షిప్ల పైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించిన దాఖలాలే లేవు కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి.అదేవిధంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేయమని,అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్దెల శ్రీకాంత్, కంబాలపల్లి విప్లవ కుమార్,డివిజన్ ఉపాధ్యక్షులు చింతకింది లక్ష్మణ్,బండి సందీప్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలియజేసిన కాంటాక్ట్ టీచర్లు.

**హైదరాబాద్,డిసెంబర్ 31(సూర్యరేఖ)**తమ సేవలను రెన్యువల్ చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.ఇతర పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ విషయమై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ......... రాష్ట్ర ప్రజలకు మంత్రి సీతక్క నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు యువతీ యువకులకు ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.పాత వ్యసనాలను విడిచిపెట్టి నూతన ఆశయాలు లక్ష్యాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలి అని,అప్పుడే జీవితంలో వెలుగులు పూస్తాయి అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలన్నారు. సంతోషమైన జీవితం వేరు అర్థవంతమైన జీవితం వేరు..క్షణికమైన సంతోషం కోసం అర్థవంతమైన జీవితాన్ని ఆగం చేసుకోవద్దు,క్షణికమైన సంతోషం కోసం డ్రగ్స్ బారిన పడకండి దుర్మార్గమైన డ్రగ్స్ ను ధ్వంసం చేద్దాం..ఆరోగ్య తెలంగాణను నిర్మించుకుందాం. విలువలతో కూడుకున్న జీవిత లక్ష్యంతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలని మీ ఇంటి ఆడపడుచుగా,సీతక్కగా కోరుకుంటున్నాను.మద్యం సేవించి వాహనాలు నడపకండి,వేగంతో ప్రయాణాలు చేసి



ప్రమాదాలను కొని తెచ్చుకోకండి.డ్రగ్స్ రహిత తెలంగాణ రాష్ట్రం కోసం అందరం ప్రతిన భూనుదాం..అందరికీ హ్యాపీ న్యూ ఇయర్ అని మంత్రి సీతక్క అన్నారు.

## మెదక్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన.-తాజా మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్



**కొల్చారం,డిసెంబర్ 31(సూర్యరేఖ)**గడిచిన క్షణాన్ని స్మరిస్తూ..రాబోయే క్షణాన్ని ఊహిస్తూ..ఉదయించే ఉషస్సుల కోసం ఎదురుచూస్తూ నూతన సంవత్సరంలోకి అడివిడుతున్న మెదక్ జిల్లా,చేగుంట మండల ప్రజలకు చేగుంట మండలం చందాయిపేట గ్రామ తాజా మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నూతన సంవత్సరానికి సంబంధించి చేగుంట మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. మండలంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.అధిక మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని యువకులకు సూచించారు.సంతోషకరమైన రోజుని..విషాదకరంగా చేసుకోవద్దన్నారు. సంతోషకరంగా,సురక్షితంగా నూతన సంవత్సర వేడుకలను తమ తమ కుటుంబ సభ్యులు,స్నేహితులతో కలిసి జరుపుకోవాలని స్వర్ణలత భాగ్యరాజ్ తెలిపారు.

## జిల్లాలో 30,30(ఎ) పోలీసు యాక్ట్ అమలు..

**జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి**



**మెదక్,డిసెంబర్31(సూర్యరేఖ)** మెదక్ జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని (జనవరి 01వ తేది నుండి 31వ తేదీ వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు,నిరసనలు,ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు,సభలు,సమావేశాలు నిర్వహించ రాదని తెలిపారు.అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు.కాబట్టి జిల్లా ప్రజలు,ప్రజా ప్రతినిధులు,వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.

## మండల ప్రజలకు నూతన శుభాకాంక్షలు..

**కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు**



**కొల్చారం,డిసెంబర్ 31(సూర్యరేఖ)** నూతన సంవత్సరంలో జరగబోయే కార్యక్రమాలు.. పంటలు పండించే రైతులు,పాడి పశువులు,ప్రజా ప్రతినిధులు,అధికారులు,కొల్చారం మండల ప్రజలకు గత 2024 సంవత్సరం ముగించుకుని 2025లోకి అడుగుపెడుతున్న సందర్భంగా కొల్చారం మండలం ప్రజలకు నూతన శుభాకాంక్షలు తెలుపుతున్నానని కొల్చారం బీఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గడిచిన క్షణాన్ని..స్మరిస్తూ..రాబోయే క్షణాన్ని ఊహిస్తూ.. సంవత్సర కాలమంతా మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,రైతులు వేస్తున్న వరి పంటలలో పంటలు బాగా పండించి రైతుల్లో ఆనందం వెదజల్లేలా 2025 సంవత్సరం కాలమంతా ప్రజలకు ఎటువంటి అటంకాలు జరగకుండా, తమ తమ కుటుంబాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని భగవంతుని మనసారా కోరుకుంటూ,కొల్చారం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నానని కొల్చారం మండలం బీ ఆర్ఎస్ పార్టీ తుంకులపల్లి సంతోష్ రావు తెలిపారు.

# బడ్జెట్ స్కూళ్ళను ప్రభుత్వం ఆదుకోవాలి..

**రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం విజ్ఞప్తి..**
**గురునానక్ స్కూల్లో జరిగిన మండల స్థాయి అంతర పాఠశాలల క్యారమ్స్ పోటీల్లో ఉత్సాహం పాల్గొన్న విద్యార్థులు..**



**రాజేంద్రనగర్,డిసెంబర్ 31**రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహం పాల్గొన్నారు. మంగళవారం సిక్ చావునీలోని గురునానక్ హైస్కూల్లో నిర్వహించిన క్యారమ్స్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి,ప్రధాన కార్యదర్శి జి.శరవణ్ కుమార్ లు సంఘం కోశాధికారి ఎస్ఆర్. రజినీకాంత్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శులు వేణుగోపాల్,బోయ లక్ష్మణతో కలసి ప్రారంభించారు. సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు క్యారమ్స్ పోటీల్లో పాల్గొని తమలోని క్రీడా స్ఫూర్తిని చాటారు.ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ...రాజేంద్రనగర్ మండల పరిధిలోని బడ్జెట్స్ స్కూల్స్ యాజమాన్యం ఏకతాటిపై ఉంటూ విద్యార్థుల్లో విద్యాభివృద్ధి తోపాటు,క్రీడా నైపుణ్యాన్ని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే ప్రైవేట్ పాఠశాలల అంతర క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్కూళ్ల కారణంగా బడ్జెట్ స్కూళ్ళకు తీరని అన్యాయం,నష్టం జరుగుతుందన్నారు.దీనిపై ప్రభుత్వం ఆలోచించి బడ్జెట్ స్కూళ్ళను ఆదుకోవడానికి ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరారు.విద్యాశాఖ ఆదేశాలను తూచ తప్పకుండా ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు కొనసాగేలా యాజమాన్య సంఘం ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని తెలిపారు.తమ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడా,పోటీ తత్వ నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ మండల స్థాయి ప్రైవేట్ పాఠశాలల అంతర క్రీడోత్సవాలు దోహం చేయాలనేదే తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ. యాదగిరి,కరస్పాండెంట్లు మధుసూధన్,కరుణాకర్, రాజేంద్రప్రసాద్,మహ్మద్ వాజిద్,శేషు,గురునానక్ స్కూల్ పిఈటి అమృతపాణి,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి





**ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి..**
**పర్యవేక్షణ లేకపోతే నాణ్యత కొరవ..**
**నాణ్యతతో పనులు చేపట్టాలి..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్,డిసెంబర్31** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లో ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానికంగా ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన కర్తవ్యమని ఆయన వ్యాఖ్యానించారు.మంగళవారం సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీ భూగర్భ డ్రైనేజీ నాలా పనులను తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి జలమండలి,మున్సిపల్ సిబ్బందికి పనుల విషయంలో పలు సూచనలు చేశారు. ప్రధానంగా పనులు నిర్వహించే క్రమంలో నాణ్యతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు.ఎక్కడ పనులు చేపట్టినా పనుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని అన్నారు.పనుల నాణ్యతకు ఇది ఎంతో ముఖ్యమని వ్యాఖ్యానించారు.పర్యవేక్షణ లేకపోతే అడ్డగోలు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. పనుల్లో నాణ్యతలో రాజీ పడవద్దని,నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు.పనులు జరుగుతునప్పుడు వర్క్ ఇన్‌స్పెక్టర్లు,అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, కాంట్రాక్టర్లు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పనులు చేయాలని ఆదేశించారు.క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీలు కూడా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి, పార్కింగ్ ఇన్స్పెక్టర్ భాను,జలమండలి సూపర్వైజర్ వినయ్, ముఖ్య నాయకులు చెన్ రెడ్డి బుచ్చిరెడ్డి,నరసింహారెడ్డి,ఉత్తం, యాదగిరి, కిరణ్, ఆర్.భూపతిరెడ్డి, రామకృష్ణ, అభి, నరసింహ,చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**నిజాంపేట,డిసెంబర్31 (సూర్యరేఖ)**మండల ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ కంఠా రెడ్డి తిరుపతిరెడ్డి,నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.2025 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో వెల్లివిరియాలని, సంపద సమృద్ధి కలగాలని కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఆకాంక్షించారు.నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు ఆశీస్సులు దీవెనలు అందిస్తారని ఆశిస్తూ కంఠా రెడ్డి, తిరుపతిరెడ్డి, నియోజకవర్గ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# కొత్త సంవత్సరంలో అంగన్వాడి లబ్ధిదారులకు మరింత సేవలు



**శివంపేట్,డిసెంబర్ 31 (సూర్యరేఖ)**కొత్త సంవత్సరంలో అంగన్వాడీ లబ్ధిదారులకు మరింత సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమా భార్గవి తెలిపారు. మంగళవారం శివ్వంపేట మండల కేంద్రంలో ఐసీడీఎస్ మండల సూపర్వైజర్ సంతోష ఆధ్వర్యంలో సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమ భార్గవి మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆట పాటల ద్వారా విద్య నేర్పడంతో పాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు,పిల్లలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ టీచర్లు లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు.విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి చేయాలన్నారు.అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. అంగన్వాడీ సెక్టర్ సమావేశం సందర్భంగా 2025 నూతన సంవత్సర వేడుకలను ముందస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీ హేమా భార్గవి, సూపర్వైజర్ సంతోష కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరంలో అంగన్వాడీ లబ్ధిదారులకు మరింత సేవలందించి అందరూ బాగుండాలని కాంక్షించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సంతోష అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## కొల్చారం మండల ప్రజలకు నూతన శుభాకాంక్షలు...

**బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్**



**కొల్చారం,డిసెంబర్ 31(సూర్యరేఖ)** కొల్చారం మండల ప్రజలకు గత 2024 సంవత్సరం ముగించుకుని 2025లోకి అడుగుపెడుతున్న సందర్భంగా కొల్చారం మండలం ప్రజలకు నూతన శుభాకాంక్షలు తెలుపుతున్నానని కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గడిచిన క్షణాన్ని..స్మరిస్తూ.. రాబోయే క్షణాన్ని ఊహిస్తూ..సంవత్సర కాలమంతా మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు వేస్తున్న వరి పంటలలో బాగా పండించి రైతుల్లో ఆనందం వెదజల్లేలా 2025 సంవత్సరం కాలమంతా ప్రజలకు ఎటువంటి అటంకాలు జరగకుండా,తమ తమ కుటుంబాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని భగవంతుని మనసారా కోరుకుంటున్నా అన్నారు. కొల్చారం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు.

## వాసవి క్లబ్ ఇంటర్నేషల్ వి102ఎ గవర్నర్ గా డా. సరాబు అనంతం గుప్త ఏకగ్రీవం..



**రాజేంద్రనగర్,డిసెంబర్ 31** వాసవి క్లబ్ ఇంటర్నేషల్ వి 102ఎ జిల్లా గవర్నర్ గా రాజేంద్రనగర్ సర్కిల్ సాయిబాబానగర్ కు చెందిన డాక్టర్ సరాబు అనంతం గుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఇప్పటి వరకు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఉన్న షాద్ నగర్ కి చెందిన సూరిశెట్టి నరసింహా గుప్త పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో నూతన గవర్నర్ గా వాసవి క్లబ్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ వి.102 ఎ ప్రతినిధులు డాక్టర్ సరాబు అనంతరం గుప్తను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.2025 జనవరి 1వ తేదీ నుంచి ఏడాది కాలం పాటు డాక్టర్ సరాబు అనంతం గుప్త వాసవి క్లబ్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ వి.102ఎ గరవర్నర్ గా కొనసాగుతారు.

## కొల్చారం మండల,చిన్న ఘనపూర్ ప్రజలకు శుభాకాంక్షలు..

**బీఆర్ఎస్ మండల వైస్ ప్రెసిడెంట్ బైఖరి శ్రీకాంత్**



**కొల్చారం,డిసెంబర్ 31(సూర్యరేఖ)**కొల్చారం మండల, చిన్న ఘనపూర్ ప్రజలకు గత 2024 సంవత్సరం ముగించుకుని 2025లోకి అడుగుపెడుతున్న సందర్భంగా బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ బైఖరి శ్రీకాంత్ కొల్చారం మండలం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గడిచిన క్షణాన్ని. స్మరిస్తూ రాబోయే క్షణాన్ని ఊహిస్తూ..సంవత్సర కాలమంతా మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మేయర్,కార్పొరేటర్లు





**ఉప్పల్,డిసెంబర్31( సూర్య రేఖ):** కాప్రా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో గురుస్వామి రేగళ్ల సతీష్ రెడ్డి 23వ అయ్యప్ప స్వామి మహపడి పూజను ఘనంగా నిర్వహించారు. పూజా ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామిల ప్రతిమలను ఏర్పాటు చేసి కేరళ శభరిమల ఆలయం మాదిరిగా బంగారు వర్ణంతో కూడిన 18 పడి మెట్లను ఏర్పాటు చేసి పూలు,పండ్లతో అందంగా అలంకరించారు.నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో కలసి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.సాయంత్రం స్వామివారి ఊరేగింపు, కీర్తనలు, భజనలతో ఆ ప్రాంగణమంత అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది.భక్త బృందం ఆలపించిన పాటలకు కన్నెస్వాములు, భక్తులు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు.ఈ పూజ కార్యక్రమాన్ని శివ,కార్తీక్ శాస్త్రి బృందంచే నిర్వహించారు.పూజ అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు,అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దు పంతులు,వినీత్ పంతులు, కన్య స్వాములు,కత్తి స్వాములు,ఘంట స్వాములు,గదా స్వామిలు, గురుస్వాములు,పెద్ద ఎత్తున స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో వాచ్ నైట్ సర్వీస్ ప్రార్థనలు



రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఫెలోషిప్
అధ్యక్షురాలు పాస్టర్ పి.అనూరాధ స్వర్ణ కుమార్



రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్
ప్రధాన కార్యదర్శి రెవరెండ్ మనోహరం



రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్
అధ్యక్షులు రెవరెండ్ కె.సుందర్ పాల్

**నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతు రాత్రి 12గంటల వరకు చర్చిలలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు..**

**క్రైస్తవ సమాజానికి,ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ పాస్టర్స్,పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు..**

**రాజేంద్రనగర్,డిసెంబర్ 31** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చిలలో క్రైస్తవులు మంగళవారం రాత్రి వాచ్ నైట్ సర్వీస్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలలో పాల్గొన్నారు.2024వ సంవత్సరంలో ఏసుప్రభు తమ జీవితాలలో చేసిన మేలులను తలపోస్తూ సంఘ సభ్యుల ఎదుట సాక్ష్యము చెప్పి దేవుని మహిమ పరిచారు.రాత్రి 12 గంటల వరకు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## 2025వ సంవత్సరం ఆశీర్వాదకరంగా ఉండాలి..

రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రెవరెండ్ కె.సుందర్ పాల్,రెవరెండ్ మనోహరం..2025వ సంవత్సరం ప్రజలందరికీ ఆశీర్వాదకరంగా ఉండాలని రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుందర్ పాల్,రెవరెండ్ మనోహరం అన్నారు.ఏసుప్రభు అందరి జీవితాలలో మేలు చేయాలని ప్రార్థించారు.ప్రతి ఒక్కరూ నీతి మార్గంలో జీవిస్తూ,సహోదరుల పట్ల ప్రేమ,దయ, కరుణ,కలిగి జీవించాలన్నారు.ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలనే ఆలోచన కలిగి ముందుకు సాగాలన్నారు.

**ప్రతి ఒక్కరిపై దేవుని కృప ఉండును గాక :**

రాజేంద్ర నగర్ పాస్టరమ్మల కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారామ్,పాస్టర్ పి.అనురాధ స్వర్ణ కుమార్2025 నూతన సంవత్సరములో ప్రతి ఒక్కరిపై దేవుని కృప ఉండాలని,అందరూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో జీవించాలని, ఏసుప్రభు దయ అందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నామని పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాస్టర్ ఎన్. స్వర్ణ రాజారామ్,పాస్టర్ పి.అనురాధ స్వర్ణ కుమార్ లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దేవుని భయంతో జీవించాలన్నారు.ప్రతిరోజు వాక్యం చదువుతూ, ప్రార్థిస్తూ దేవుని వేడుకున్నప్పుడు అంతా మేలు జరుగుతుందన్నారు.



రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఫెలోషిప్
ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఎన్.స్వర్ణ రాజారామ్

## కొల్చారం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

-కొల్చారం మండలం మాల మహానాడు
అధ్యక్షుడు ఎర్ర పురుషోత్తం



**కొల్చారం,డిసెంబర్31(సూర్య రేఖ)** కొల్చారం మండలం మాల మహానాడు తరపున మండల ప్రజలకు మాల మహానాడు మండల అధ్యక్షుడు ఎర్ర పురుషోత్తం నూతన శుభాకాంక్షలు తెలిపారు.ఈ నూతన సంవత్సరంలో పంటలు పండించే రైతులు,పాడి పశువులు,ప్రజా ప్రతినిధులు, అధికారులు,కొల్చారం మండల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## గచ్చిబౌలీ ఖాజాగూడ భగీరథమ్మ చెరువులో అక్రమ కట్టడాలను కూల్చివేసిన హైడ్రా..

కూల్చివేతలు చేపట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు..
విరుపాక్షాల మధ్య వాగ్వాదం..



**శేర్లింగంపల్లి,డిసెంబర్31(సూర్యరేఖ)** హైడ్రా కూల్చివేతలు ఖాజాగూడలో కలకలం రేపాయి.గచ్చిబౌలిలోని ఖాజా గూడ భగీరథమ్మ చెరువులో హైడ్రా కూల్చివేతలు మంగళవారం సంచలనం రేపాయి.చెరువు ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లోని నిర్మాణాలను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు.ఖాజాగూడ సర్వేనెంబర్ 18 ఎఫ్ టిఎల్,బఫర్ జోన్ లో ఎకరాల అక్రమ నిర్మాణాలు చేపట్టారు.వీటిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. స్థానికులు ఫిర్యాదులు చేయడంతో 20 పైగా దుకాణాలను అధికారులు కూల్చేశారు. మరోవైపు నోటీసు ఇచ్చిన 24 గంటల్లోనే దుకాణాలు కూల్చేయడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంత తక్కువ సమయంలో ఖాళీ ఎలా చేయాలో అధికారులు చెప్పాలంటూ మండిపడ్డారు.అధికారులు నిర్మాణాలలో కూల్చే క్రమంలో స్థానికులకు అధికారులకు నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది.ఈ నేపథ్యంలో అధికారులు స్థానికులకు సముదాయించారు. కాగా,అంతకుముందు ఖాజాగూడలోని అక్రమ నిర్మాణాలపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి.దీంతో ఇటీవలే భగీరథమ్మ చెరువులోని ఆక్రమణలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.ఈ క్రమంలోనే నోటీసులు ఇచ్చి ఆక్రమణలను కూల్చివేశారు.

## నూతన సంవత్సర వేడుకల్లో మణికంఠ హిల్స్ లో ప్రత్యేక పూజలు..

**రాజేంద్రనగర్,డిసెంబర్31**నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ టీఎన్జీవిఎస్ కాలనీ మణికంఠ హిల్స్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు వివరించారు.ఉదయం ఐదున్నర గంటలకు గణపతి హెూమం,గణపతి అభిషేకం,7 గంటలకు అయ్యప్పస్వామి అభిషేకాలు చేయడం జరుగుతుందన్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించాలని స్వాములు,సివిల్ భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 8008114409, 9391018367,9391001243 లను సంప్రదించాలన్నారు.

## దక్షిణ ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం

**పెళ్లి బృందం వ్యాను అదుపు తప్పి వంతెన పైనుంచి నదిలో పడి 66 మంది మృతి**

**అదీస్ అబబా :** దక్షిణ ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందం వ్యాను అదుపు తప్పి గెలాన్ వంతెన పైనుంచి నదిలో పడిపోవడంతో 66 మంది మృతి చెందారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. సహాయక చర్యలకు ఆలస్యం జరగడంతో ఎక్కువ మంది మరణించారని స్థానిక మీడియా వెల్లడించింది. నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కర్రల సహాయంలో బాధితులను కాపాడేందుకు స్థానికులు ప్రయత్నించారు. వివాహ వేడుక నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

## పబ్‌పై పోలీసుల దాడి

**హైదరాబాద్ :** చ్చిబౌలిలోని ఓ పబ్‌లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 25 మందిని తనిఖీ చేయగా వారిలో.. 8 మందికి డ్రగ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధి మాదాపూర్‌లో ఆదివారం రాత్రి క్వాక్ పబ్‌లో టీన్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎుంంొః ఆధ్వర్యలో 22 మందితో కూడిన ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, ఎలక్ట్రానిక్ అండ్ ఫిజికల్ నిఘా, అలాగే డ్రగ్స్ వినియోగించే వ్యక్తులను గుర్తించడానికి శిక్షణ పొందిన స్పాటర్‌లతో ఈ ఆపరేషన్ ప్లాన్ చేసినట్లు ఎుంంొః డైరెక్టర్ సందీప్ శాండిల్య చెప్పారు.కొండాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాక్ పబ్‌లో రాత్రి బెన్ భూమర్ భ్లూమ్ లైవ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు వచ్చిన వారిలో 25 మంది నుంచి పోలీసులు డ్రగ్స్ నిర్ధారణ నమూనాలు సేకరించారు. వారిలో మూత్ర శాంపిల్స్‌లో నలుగురికి, సేలైవా శాంపిల్స్‌లో మరో నలుగురికి మొత్తం 8 మందికి ఈ తనిఖీల్లో పాజిటివ్ నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్ అధునాతన డ్రగ్ డిటెక్షన్ కిట్‌లను పోలీసులు వినియోగించారు. మూత్రం, లాలాజల పరీక్ష కిట్‌ల ద్వారా త్వరిత గతిన ఫలితాలు రాబట్టారు. పాజిటివ్ వచ్చిన 8 మందిలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

# బిజినెస్

## ట్యాక్స్ పేయర్లకు శుభవార్త.. డెడ్‌లైన్ పొడిగింపు



ఆదాయపు పన్ను శాఖ 'వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024' గడువును పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పన్ను చెల్లింపుదారులకు తక్కువ ట్యాక్స్ రేట్లతో వివాదాలను పరిష్కరించుకోవడానికి ఈ అవకాశాన్ని కల్పించింది. డిసెంబర్ 31తో ముగియనున్న 'వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024' గడువును ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ 2025 జనవరి 31కి పొడిగించింది. ఈ గడువును పొడిగించకుండా ఉండి ఉంటే.. దరఖాస్తు చేసుకునేవారు 10 శాతం అదనపు పన్ను చెల్లించాల్సి ఉండేది. కాబట్టి ఇప్పటి వరకు ఈ స్కీమ్ కోసం అప్లై చేసుకొని వారు కూడా నిర్దిష్ట గడువు లోపల అప్లై చేసుకోవచ్చు.వివాద్ సే విశ్వాస్ స్కీమ్ అనేది.. 2024 బడ్జెట్‌లో ప్రకటించారు. పన్ను చెల్లింపుదారులు తక్కువ మొత్తంలో వివాద్ సే పన్నును చెల్లించడం ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి అనుమతిస్తుంది.2025 జనవరి 31 తరువాత లేదా ఫిబ్రవరి 1నుంచి వివాద్ సే విశ్వాస్ స్కీమ్ కోసం అప్లై చేసుకునే వారు అదనంగా 10 శాతం పన్నును చెల్లించాల్సి ఉంటుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ సీబీడీటీ పేర్కొంది. దీనికి సంబంధించిన ట్వీట్ కూడా నెట్టింట్లో వైరల్ అవుతోంది.

## ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీల పొరపాట్లకు చెక్




క్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఆన్‌లైన్ లావాదేవీలు అధికమవుతున్నాయి. చాలామంది యూపీఐ, ఇమ్మిడియెట్ పేమెంట్ సర్వీస్ ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ వంటి సదుపాయాలు వినియోగిస్తుంటారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే నగదు లావాదేవీల్లో ఏదైనా పొరపాటు జరిగి వేరే అకౌంట్‌లోకి డబ్బు జమైతే తిరిగి వాటిని రాబట్టడం పెద్దపని. కాబట్టి పేమెంట్ చేసేముందే అన్ని వివరాలు సరిచూసుకుంటే సమస్య ఉండదు. ఈ నేపథ్యంలో ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీల్లో జరిగే మోసాలు అరికట్టడానికి, పొరబాట్లు జరగకుండా నగదు బదిలీ చేసేందుకు ఏ ఖాతాకైతే నగదు వెళుతుందో ఆ ఖాతాదారుడి పేరును తనిఖీ చేయడానికి వినియోగదార్లకు వీలు కల్పించేలా ఒక సదుపాయాన్ని (లుక్ అప్ ఫెసిలిటీ) అందుబాటులోకి తీసుకురావాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)ను ఆర్‌బీఐ కోరింది. ఏప్రిల్ 1, 2025 వరకు ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ సర్వీసు అందిస్తున్న అన్ని బ్యాంకులకు ఈ సదుపాయాన్ని అందించాలని ఆర్‌బీఐ సూచించింది.ఫోన్‌పే, జీపే.. వంటి థర్డ్‌పార్టీ యూపీఐ పేమెంట్ యాప్‌లు, ఐఎంపీఎస్ ద్వారా లావాదేవీలు జరుపుతున్న సమయంలో ఎవరికైతే డబ్బు పంపించాలో ఆ ఖాతాదారుడి పేరు వివరాలు ధ్రువీకరించే వెసులుబాటు ఉంటుంది. కానీ ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా చేసే లావాదేవీలకు ఆ సదుపాయం లేదు.

# 2024లో ఐపీవోలదే హవా

## భారీ లాభాలు తెచ్చిన కంపెనీలు ఇవే..

2024వ సంవత్సరంలో ఐపీఓలతో భారత స్టాక్‌మార్కెట్ కళకళలాడింది. ఏకంగా 90కి పైగా కంపెనీలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (%ూ) ద్వారా స్టాక్ మార్కెట్‌లో అడుగు పెట్టాయి. అంతేకాదు ఈ ఐపీఓలలో దాదాపు 65 శాతం ప్రస్తుతం వాటి ఇష్యూ ప్రైస్ కంటే ఎక్కువగా ట్రేడవుతుండటం గమనార్హం. 2024లో వరుస ఐపీఓలు ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందించాయి. ఈ లిస్టులో ఉన్న టాప్ కంపెనీలు ఏవో చూద్దాం. అనేక కంపెనీలు తమ ఇష్యూ ప్రైస్‌లకు మించి పెట్టుబడిదారులకు అత్యుత్తమ రాబడిని అందించాయి. టాప్ గెయినర్లుగా నిలిచింది ఇవే.. అన్ని ఐపీఓలు పాజిటివ్ ట్రెండ్‌ని కొనసాగించలేకపోయాయి. కొన్ని కంపెనీలు తమ షేర్ల ఇష్యూ ధరల కంటే దిగువకు పడిపోయాయి. పెట్టుబడిదారులను నిరాశపరిచాయి. పాపులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ ఇష్యూ ధర రూ.295కాగా ఇది 47% తగ్గింది. అలానే క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇష్యూ ధర రూ.468 కాగా 40% పడిపోయింది. వొడాఫోన్ ఐడియా కంపెనీ ఎఫ్‌పీఓ ప్రైస్ నుంచి 32% తగ్గింది. లిస్టింగ్ రోజున షేర్ ధర వెంటనే పెరగడాన్ని లిస్టింగ్ గెయిన్స్‌గా పేర్కొంటారు. ఈ ఏడాది చాలా కంపెనీలు అత్యుత్తమ లిస్టింగ్ గెయిన్స్ ఇచ్చాయి. అందులో వైభోర్ స్టీల్ ట్యూబ్స్ కంపెనీ లిస్టింగ్ రోజున 196% లాభం అందించింది. అలానే బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ లిమిటెడ్ కూడా అరంగేట్రంలో అదరగొట్టింది, ఇన్వెస్టర్లకు 171% లాభం ఇచ్చింది. మమతా మెషినరీ డిసెంబర్‌లో లిస్టింగ్ రోజున 159% గెయిన్స్ జనరేట్ చేసింది. 2024 డిసెంబర్‌ని దాదాపు 17 సంవత్సరాల్లో అత్యధిక ఐపీఓలు వచ్చిన నెలగా పేర్కొనవచ్చు.



15 కంటే ఎక్కువ ఐపీఓలు ఏకంగా రూ.24,950 కోట్లు సేకరించాయి. 2007 ఫిబ్రవరిలో చివరిసారిగా ఈ స్థాయిలో 18 ఐపీఓలు వచ్చాయి. డిసెంబరులో వచ్చి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కంపెనీల్లో మమత మెషినరీ, ఒన్ మొబిక్విక్ సిస్టమ్స్, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్స్, విశాల్ మెగా మార్ట్ ఉన్నాయి. డిసెంబర్‌లనే సురక్ష డయాగ్నోస్టిక్ నెగెటివ్‌గా లిస్ట్ అయింది. దాని ఇష్యూ ధర రూ.441 నుంచి 13% క్షీణతను చూసింది. %ఖుత్‌శీఎఫ్ష్త్ర% గ్రూప్ నివేదిక ప్రకారం, మన దేశంలో 2024లో యూఎస్ కంటే రెండు రెట్లు ఎక్కువ %ూ%లు వచ్చాయి. అలానే యూరప్ కంటే 2.5 రెట్లు ఎక్కువ ఐపీఓలు లిస్ట్ అయ్యాయి. దాదాపు 76 కంపెనీలు ఈ సంవత్సరంలో మొదటి 11 నెలల్లో రూ.1.3 ట్రిలియన్‌లను సమీకరించాయి.

## 2025లో రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి 5 క్రేజీ మోటార్ సైకిళ్లు!

రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రతి సంవత్సరం తన కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేస్తుంది. 2024లో షాట్ గన్ 650, గెరిల్లా 450, క్లాసిక్ గోవా 350, ఇంటర్‌సెప్టర్ బేర్ 650లను కూడా విడుదల చేశారు. ఇది కాకుండా వినియోగదారులు క్లాసిక్ 350 అప్‌డేట్ వెర్షన్‌ను కూడా చూశారు. 2025 సంవత్సరంలో కూడా కొత్త మోడళ్లను విడుదల చేయడానికి కంపెనీ సిద్ధమవుతోంది. కొత్త ఏ బైకులను తీసుకురానుందో చూద్దాం.. రాయల్ ఎన్ ఫీల్డ్ ఇటీవల స్క్రామ్ 440ను ప్రదర్శించింది. స్క్రామ్ 440 టూ వీలర్ 443సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది గరిష్టంగా 25.4 బిహెచ్‌పీ పవర్, 34 ఎన్ఎమ్ గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. స్క్రామ్ 440.. 2025 సంవత్సరంలో లాంచ్ కావచ్చని పలు మీడియా నివేదికలు పేర్కొన్నాయి.రాయల్ ఎన్‌ఫీల్డ్ మోస్ట్ అవైటెడ్ క్లాసిక్ 650ను లాంచ్ చేయడానికి సిద్ధంగా ఉంది. 2025 జనవరిలో కంపెనీ దీన్ని లాంచ్ చేసే అవకాశం ఉంది. ఈ బైక్ 648సీసీ ప్యారలల్-ట్విన్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది గరిష్టంగా 46.3 బీహెచ్పీ శక్తిని, 52.3 ఎన్ఎమ్ గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ 450 ర్యాలీ వెర్షన్ ప్రస్తుత మోడల్ కంటే మంచి డిజైన్‌తో తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది కొత్త ఎగ్జాస్ట్ ఎండ్-క్యాన్, అప్‌డేట్ చేసిన బాడీవర్క్‌తో రానుంది. న్యూస్ వెబ్సైట్ గాడివాడి నివేదిక ప్రకారం, ఈ మోటార్ సైకిల్ పూర్తిగా అడ్జస్టబుల్ ఫ్రంట్, రియర్ సస్పెన్షన్ వంటి ఫంక్షనల్ అప్‌గ్రేడ్‌లను పొందే అవకాశం ఉంది.క్లాసిక్ 650 మాదిరిగానే రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా బుల్లెట్ 650 ట్విన్ మోటార్ సైకిల్‌ను పరీక్షిస్తోంది. బుల్లెట్ 650 డిజైన్ కూడా బుల్లెట్ 350ను పోలి ఉంటుంది. క్లాసిక్ 650 మాదిరిగానే ఇది కూడా అదే కాంపోనెంట్స్, పవర్‌ట్రెయిన్ కలిగి ఉండే అవకాశం ఉంది.ఇంటర్‌సెప్టర్ 750 టెస్ట్ మ్యూల్ మాదిరిగానే కాంటినెంటల్ జీటీ 750 టెస్ట్ మ్యూల్ కూడా ముందు భాగంలో డ్యూయల్ డిస్క్ బ్రేక్ సెటప్‌తో కనిపిస్తుంది. అల్లాయ్ వీల్స్, ట్యూబ్ లెస్ టైర్లలో చూడవచ్చు. 2025లో కంపెనీ ఈ బైక్‌ను లాంచ్ చేయనుంది.



# స్పోర్ట్స్

## టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ

# రిటైర్మెంట్?



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గత కొద్దికాలంగా పేలవమైన ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలోనూ తన చెత్త ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ సిరీస్ తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రోహిత్ వరుస వైఫల్యాల నేపథ్యంలో పలువురు మాజీలతో పాటు అభిమానులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. రోహిత్ టెస్టుల్లో కొనసాగడం అవసరమా? అంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐతో పాటు సెలెక్టర్లు సైతం ఈ విషయంలో గురించి మాట్లాడినట్లుగా తెలుస్తున్నది. రోహిత్ తన మనసును మార్చుకునే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయని తెలుస్తున్నది. రోహిత్ ఎప్పుడు తిన నిర్ణయాన్ని ప్రకటిస్తాడన్న విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. కానీ, జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా మొదలయ్యే ఐదో టెస్ట్ అనంతరం రిటైర్మెంట్‌పై ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్లుగా సమాచారం.



### ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌కి అర్హత సాధించకపోతే..

టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించగలిగితే.. రోహిత్ అప్పటి వరకు కొనసాగేలా సెలెక్టర్లు ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవకాశాలున్నాయి. నాలుగో టెస్ట్ ఓటమి తర్వాత టీమిండియా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు కాస్త దూరమైంది. ప్రస్తుతం, ఫైనల్ ఆశలు కాస్త ఉన్నా.. అది ఇతర జట్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో పరాజయం అనంతరం రోహిత్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నాడు. గతంలో ఏం జరిగిందో ఆలోచించాల్సిన అవసరం లేదని.. సహజంగానే కొన్ని ఫలితాలు తమకు అనుకూలంగా లేదన్నాడు. బాక్సిండ్ డే టెస్ట్‌లో ఓటమి తనకు మానసిక వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అనుకున్నది చేయలేని సమయంలో.. మానసిక సంఘర్షణ ఉంటుందని రోహిత్ పేర్కొన్నాడు. బాక్సింగ్ డే టెస్టు నిరాశపరిచిందన్న రోహిత్.. మ్యాచ్‌లు గెలిచేందుకు మార్గాలు ఉంటాయని.. వాటిని అన్వేషించలేకపోయామని చెప్పుకొచ్చాడు. చివర వరకు పోరాడాలని నిర్ణయించినా.. దురదృష్టవశాత్తు అలా చేయలేకపోయామని చెప్పాడు.

### మూడు టెస్టుల్లో 31 పరుగులు

ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టెస్టుల్లో రోహిత్ 31 పరుగులు చేశాడు. బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా జరిగిన మ్యాచుకు రోహిత్ దూరమయ్యాడు. రోహిత్ గైర్హాజరీలో మిస్టరీ బౌలర్ కెప్టెన్‌గా కొనసాగాడు. తొలి టెస్ట్‌లో 295 పరుగుల తేడాతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం సాధించింది. అడిలైడ్‌లో జరిగిన టెస్టుతో మళ్లీ టీమిండియాతో రోహిత్ చేశాడు. డే-నైట్ టెస్ట్‌లో టీమిండియా ఓటమిపాలైంది. ఆ తర్వాత గబ్బా, మెల్‌బోర్న్‌లో టెస్టుల్లోనూ పరాజయం తప్పలేదు. రోహిత్ ఐదు ఇన్నింగ్స్‌లో 6.20 సగటుతో 31 పరుగులు చేశాడు. వరుసగా ఐదు ఇన్నింగ్స్‌లో కలిపి 3, 6, 10, 3, 9 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఏ విదేశీ కెప్టెన్‌కైనా అత్యల్ప సగటు ఇదే. ఓ వైపు జట్టు ఓటమి.. మరో వైపు రోహిత్ ప్రదర్శనపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో రోహిత్ రిటైర్మెంట్‌కు సిద్ధమయ్యాడని తెలుస్తున్నది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించకపోతే సిడ్నీ టెస్ట్ తర్వాత రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలున్నట్లుగా పలు నివేదికలు పేర్కొన్నాయి.

## యువ ఆల్‌రౌండర్ నితీశ్‌రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తిన సునీల్ గవాస్కర్!



టీమిండియా యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డిని మాజీ కెప్టెన్ సునీల్ గవార్కర్ ప్రశంసలతో ముంచెత్తారు. భారత క్రికెట్ షైనింగ్ స్టార్‌గా పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా కష్టాల్లో ఉన్న సమయంలో నితీశ్ అద్భుత సెంచరీ సాధించాడు. నితీశ్‌కు టెస్టు కెరీర్‌లో ఇదే తొలి సెంచరీ. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 114 పరుగులు చేశాడు. అయితే, ఈ ఇన్నింగ్స్‌తో జట్టును గెలువలేకపోయింది. హార్దిక్‌తో నితీశ్‌ను గవాస్కర్ పోల్చారు. తొలినాళ్లలో హార్దిక్ కంటే నితీశ్ చాలా బెటర్ అని చెప్పారు. స్పోర్ట్స్ వెబ్‌సైట్ కాలమ్ రాశారు. యువ స్టార్‌లలో ఒకరైన నితీశ్‌కుమార్ రెడ్డిని మెల్‌బోర్న్ టెస్ట్ తెరపైకి తెచ్చింది. హైదరాబాద్ ఫ్రాంచైజీకి ఆడుతున్న సమయంలోనూ భారత క్రికెట్ జట్టు అభిమానుల దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్‌తో పాటు ఫస్ట్ క్లాస్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి నితీశ్‌కు టెస్ట్ క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. నితీశ్ పెర్త్, అడిలైడ్ టెస్టుల్లో 40 కంటే ఎక్కువగా పరుగులు చేశాడు. కానీ, తొలిసారిగా మెల్‌బోర్న్ టెస్టులో 50 కంటే ఎక్కువ పరుగులు చేశాడు. ఆ తర్వాత దాన్ని సెంచరీగా మలచడంలో సఫలమయ్యాడు. ఆస్ట్రేలియాలో టెస్టుల్లో సెంచరీ చేసిన మూడో అతి పిన్న వయస్కుడిగా నితీశ్ నిలిచాడు. సచిన్ టెండూల్కర్, రిషబ్ పంత్ మాత్రమే ఈ ఘనత సాధించారు. మెల్‌బోర్న్ టెస్ట్ నితీశ్‌రెడ్డికి ప్రత్యేకంగా నిలిచింది. ఎందుకంటే సెంచరీ సాధించిన సమయంలో నితీశ్‌రెడ్డి తండ్రి ముత్యాల రెడ్డి సైతం అక్కడే ఉన్నారు. సెంచరీ తర్వాత ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా గవాస్కర్ స్పందిస్తూ.. పెర్త్‌లో అరంగేట్రం మ్యాచ్‌లో నితీశ్ పరిస్థితిని అర్థం చేసుకొని ఆడే క్రికెటర్ అని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రతి టెస్ట్ మ్యాచ్‌లో రోజురోజుకు రాణించాడని.. మెల్‌బోర్న్‌లో భారత జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో సెంచరీ సాధించి జట్టులో తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడంలో సక్సెస్ అయ్యాడని చెప్పారు. హార్దిక్ టెస్ట్ క్రికెట్‌కు దూరమైన నాటి నుంచి మీడియం పేస్‌లో బౌలింగ్, బ్యాటింగ్ చేయగల ఆల్ రౌండర్ కోసం భారత్ వెతుకుతోందని.. నితీశ్ బౌలింగ్ ప్రస్తుతం పురోగమిస్తుందని పేర్కొన్నారు. కెరీర్ మొదట్లో హార్దిక్ కంటే నితీశ్ మెరుగ్గా కనిపించాడని చెప్పారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నితీశ్ ఇప్పటి వరకు 294 పరుగులు చేయడంతో పాటు మూడు వికెట్లు పడగొట్టాడు.



# తనవల్లే ఆ అవకాశం వచ్చింది

## సమంతకు థ్యాంక్స్ చెప్పిన కీర్తి సురేశ్

'మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ సూపర్ ఫేం సంపాదించుకుంది నేషనల్ అవార్డు విన్నింగ్ బ్యూటీ కీర్తి సురేశ్ తెలుగు, తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. వరుణ్ ధావన్‌తో కలిసి 'బేబీ జాన్' చిత్రంలో నటించింది. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 'బేబీ జాన్' చిత్రంలో అవకాశం గురించి మహానటి తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. స్టార్ నటి సమంత కారణంగానే తనకు 'బేబీ జాన్' చిత్రంలో నటించే గొప్ప అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామ్‌కు థ్యాంక్స్ చెప్పింది. 'బేబీ జాన్' చిత్రం 'తెరి' సినిమాకు రీమేక్‌గా రూపొందించిన విషయం తెలిసిందే. దీని తమిళ వెర్షన్‌లో హీరోయిన్‌గా సామ్ నటించింది. ఈ చిత్రం హిందీ రీమేక్ చేయాలని భావించిన చిత్ర బృందం సమంతను సంప్రదించగా.. సామ్ తన పేరును సూచించిందని కీర్తి సురేశ్ తాజాగా వెల్లడించింది. తమిళంలో సమంత పోషించిన పాత్రను హిందీలో తాను చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ సినిమాతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి అని పేర్కొంది. ఈ సినిమా కోసం సమంత తన పేరు చెప్పగానే తాను భయపడ్డానని%ా% అయితే సమంత తనకు ఎంతో మద్దతు ఇచ్చిందని పేర్కొంది. సమంత ఇచ్చిన ధైర్యంతోనే సినిమాను పూర్తి చేశానని చెప్పుకొచ్చింది. ఈ విషయంలో సమంతకు కీర్తి సురేశ్ కృతజతలు తెలిపింది.

# డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్

## న్యూ ఇయర్ వేళ ప్రభాస్ మెసేజ్!



న్యూ ఇయర్ వేళ సినీ నటుడు ప్రభాస్ ప్రత్యేక వీడియో రిలీజ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించారు. లైఫ్‌లో మనకు బోలెడన్ని ఆనందాలు ఉన్నాయని.. జీవితంలో కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని ప్రభాస్ తెలిపారు. మనల్ని ప్రేమించే, మన కోసం బతికేవాళ్లు ఉన్నప్పుడు.. జీవితాన్ని నాశనం చేసే డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్ అని ప్రశ్నించారు. మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని పిలుపునిచ్చారు. మీకు తెలిసిన వాళ్లు ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలు అయితే టోల్‌ఫ్రీ నంబర్ 8712671111కు కాల్ చేయాలని సూచించారు. డ్రగ్స్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. బాధితులు కోలుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

# 18 ఏళ్లకే పెళ్లి, పిల్లలు.. రెండుసార్లు విడాకులు

## హీరోయిన్లను మించిపోయిన బ్యూటీ..

సినీ పరిశ్రమలో నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. కానీ వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. 18 ఏళ్లకే ప్రేమించి పెళ్లి చేసుకుంది. 20 ఏళ్లకే తల్లైంది. ఆ తర్వాత విడాకులు తీసుకుని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. కానీ ఆ బంధం సైతం ఎక్కువ కాలం నిలవలేదు. రెండుసార్లు డివోర్స్ తీసుకుని ఒంటరిగా గడుపుతున్న ఈ భామ.. ఇప్పుడు దేశంలోనే అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న టీవీ నటిగా మారింది. ఆమె ఎవరో తెలుసా.. ? తనే బుల్లితెర నటి శ్వేతా తివారీ. ఆమె గురించి తెలుగు ప్రేక్షకుల కంటే ఎక్కువగా హిందీ అడియన్స్ కే పరిచయం. హిందీలో ఎక్కువ పాపులర్ అయిన సీరియల్ కసౌటి జిందగీ కె. ఇందులో ప్రధాన పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది శ్వేతా తివారీ. ప్రేరణ శర్మ అనే పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. ఏడేళ్లపాటు ఈ సీరియల్ ద్వారా అలరించి ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 4లో పాల్గొంది. తన ఆట తీరుతో ఈ రియాల్టీ షో టైటిల్ గెలుచుకుంది. దీంతో సోషల్ మీడియాలో ఈ అమ్మడు పేరు మారుమోగింది. అదే సమయంలో అటు ఫాలోయింగ్ సైతం పెరిగింది. ప్రస్తుతం సినిమాలు, సీరియల్స్ చేస్తూ బిజీగా ఉంది. వెండితెరపై నటిగా గుర్తింపు తెచ్చుకున్న శ్వేతా.. 1998లో నటుడు రాజా చౌదరిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి పాలక్ తివారి అనే పాప జన్మించింది. కానీ వీరిద్దరు 2007లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2013లో అభినవ్ కోహ్లీ అనే వ్యక్తిని పెళ్లి చేసుకోగా.. వీరికి రేయాన్ష్ కోహ్లీ జన్మించాడు. కానీ వీరిద్దరి బంధం ఎక్కువ కాలం సాగలేదు. 2019లో తన భర్త గృహ హింసకు పాల్పడుతున్నాడని కోర్టును ఆశ్రయించగా.. కోర్టు విడాకులు మంజులు చేసింది. ప్రస్తుతం వరుస సీరియల్స్ ద్వారా భారీగా సంపాదిస్తుంది శ్వేతా. నివేదికల ప్రకారం ఆమె ఆస్తులు రూ.81 కోట్లు ఉంటుందని సమాచారం.



# ఓటీటీలోకి రొమాంటిక్ హారర్ మూవీ..

తమిళంలో సూపర్ హిట్ అయిన సినిమా ఆరగన్. మైఖేల్ తంగదురై, కవిప్రియ మనోహరన్, శ్రీరంజని కీలకపాత్రలు పోషించిన ఈ సినిమాకు అరుణ్ కేఆర్ దర్శకత్వం వహించారు. అక్టోబర్ నెలలో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా మిక్స్ టాక్ అందుకుంది. కాన్సెప్ట్ డిఫరెంట్ గా ఉన్నప్పటికీ డైరెక్షన్ అంతగా కొత్తగా లేకపోవడంతో ఈ సినిమాకు అనుకున్నంత రెస్పాన్స్ రాలేదు. కానీ మైండ్ బ్లోయింగ్ ట్విస్టులతోపాటు మైఖేల్, కవి ప్రియ కెమిస్ట్రీ, యాక్టింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాకు ఐఎమ్ డీబీలో ఆరగన్ సినిమాకు 8.4 రేటింగ్ ను సొంతం చేసుకుంది. ఈ సినిమాకు అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయ్యింది.

తమిళ్ మూవీ ఆరగన్ ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హారర్ ఫాంటసీ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 3 నుంచి ఆహా తమిళంలో స్ట్రీమింగ్ కాబోతుంది. అయితే ఈ సినిమా తెలుగులో వస్తుందా అనేది క్లారిటీ రాలేదు. తమిళ్ ఓటీటీ రిలీజ్ డేట్ ను ఆహా అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో విడుదలైన మూడు నెలల తర్వాత ఈ సినిమా ఓటీటీలోకి వస్తుంది.

ఓ హిల్ స్టేషన్ బ్యాక్ డ్రాప్ లో దర్శకుడు అరుణ్ కేఆత్ ఆరగన్ మూవీని తెరకెక్కించాడు. శరవణన్ (మైఖేల్ తంగదురై), మాగిజిని (కవిప్రియ) ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. హిల్ స్టేషన్ లో శరవణన్ కు జాబ్ వస్తుంది. దీంతో ఉద్యోగం నిమిత్తం అక్కడకు వెళ్లిన జంటకు అనూహ్య పరిణామాలు ఎదురవుతాయి. అవేమిటీ.. ? అక్కడ ఇద్దరు ఎదుర్కొన్న సంఘటనలు ఏంటీ ? అనేది సినిమా. జనవరి 3 నుంచి ఆహా తమిళంలో స్ట్రీమింగ్ కానుంది.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,